

ఇదేమి న్యాయం..!

- పేదలకు సెంటున్నర..
- పార్టీ శ్రేణులకు మూడు సెంట్లు
- యథేచ్ఛగా వైసీపీ శ్రేణులకు స్థలాల కేటాయింపు
- ఎటువంటి పత్రాలు లేకుండానే భవంతుల నిర్మాణం
- విస్మయం వ్యక్తం చేస్తున్న సామాన్యులు



పీలేరు మండలం గూడరేవుపల్లె పంచాయతీ పరిధిలో వైసీపీ శ్రేణులు నిర్మించుకుంటున్న గృహాలు

పీలేరు, జూన్ 20: మరో 30 ఏళ్ల పాటు తాము అధికారంలో ఉంటామన్న తమ అధినేత జగన్ మాటలు నమ్మి పీలేరులో వైసీపీ నాయకులు సాగించిన భూఆక్రమణలకు అద్దం పట్టే మరో వ్యవహారం ఇటీవల పీలేరులో వెలుగు చూసింది. జగనన్న కాలనీల పేరిట వారు సాగించిన అరాచకాలు అధికార మార్పిడి తరువాత బహిర్గతమవుతున్నాయి. పేదలకు సెంటున్నర స్థలం కేటాయించి కొత్తగా టౌన్‌షిప్‌లు, పట్టణాలు అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకున్న వైసీపీ నాయకులు, అదే జగనన్న కాలనీల పక్కన తమ పార్టీ శ్రేణులు, అనుచరులు, బంధువులకు మూడు సెంట్ల స్థలం మంజూరు చేసుకున్నారు. సెంటున్నర స్థలంలో పేదలు అగ్గిపెట్టెల్లాంటి ఇళ్లు కట్టుకుంటుంటే వాటి పక్కనే వైసీపీ నాయకులు మాత్రం విశాల భవంతులు నిర్మించుకుంటున్నారు. వారిది కాని భూమిలో వారు ఇళ్లు నిర్మించుకుంటున్నా అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి మిన్నకుండిపోయారు. అధికారం గల్లంతు కావడంతో వారి ఆక్రమణలు, అరాచకాలు వెలుగులోకి వచ్చాయి. పీలేరు మండలం గూడరేవుపల్లె పంచాయతీ పరిధిలో గత ప్రభుత్వంలో స్థానిక ఆయిల్ సీడ్స్ వెనుక ప్రాంతంలో కంకర ఫ్యాక్టరీ లేఔట్ పేరుతో పేదలకు జగనన్న కాలనీ మంజూరు చేశారు. దాని పక్కనే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న డీకేటీ భూమిలో తమ పార్టీ వారికి ఒక్కొక్కరికి మూడు సెంట్ల మేర ఇంటి స్థలాలు మంజూరు చేసుకున్నారు. గృహ నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేకపోయినా ఎటువంటి జంకూ బొంకూ లేకుండా వాటిల్లో వైసీపీ శ్రేణులు ఇళ్లు నిర్మించుకుంటున్నారు.

బెదిరించి, భూమి లాక్కొని..

పీలేరు మండలం గూడరేవుపల్లె పరిధిలోని సర్వే నెం.757లో సుమారు 4 ఎకరాల భూమి ఉంది. ఆ భూమికి ఆనుకుని 2021లో జగనన్న కాలనీ వెలియడంతో వైసీపీ నాయకుల కన్ను ఈ భూమిపై పడింది. ఆ భూమి పూర్వాపరాలు వెలికితీసి దాని స్వభావం డీకేటీగా తేల్చారు. ఆ భూమి యజమానులు దానిని సుమారు 15 ఏళ్ల క్రితం ఇతరులకు అమ్మేశారని తెలుసుకున్నారు. డీకేటీ భూములు అమ్మరాదు, కొనరాదు అన్న ప్రభుత్వ నిబంధనలను అడ్డుపెట్టుకుని ఆ భూమిని కొనుగోలు చేసిన వారిని బెదిరించారు. ఆ భూమిలో తాము జగనన్న కాలనీ, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం నిర్మిస్తామని వారిని బెదిరించారు. అలా జరగకుండా ఉండాలంటే ఆ భూమిలో సగం తమ కార్యకర్తలకు ఇవ్వాలని ప్రతిపాదన పెట్టారు. పూర్తిగా భూమి కోల్పోయే బదులు సగమన్నా మిగుల్చుకుందామన్న ఆలోచనతో ఆ భూమిని కొనుగోలు చేసినవారు వారి ప్రతిపాదనకు ఒప్పుకున్నారు. ఇక అక్కడి నుంచి ఆ భూమిలో వైసీపీ శ్రేణులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. ఒప్పందం ప్రకారం సగభాగం మాత్రమే తీసుకోవాల్సిన వైసీపీ నాయకులు దాదాపు ముప్పావు భాగం ఆక్రమించేశారు. భూయజమానులు వైసీపీ ముఖ్య నేతలకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం, ఫిర్యాదు చేసిన ప్రతిసారీ స్థానిక నాయకులు వారిని భయపెట్టడం, చివరకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వారు చేసేదేమీ లేక మిన్నకుండిపోయారు. ఆక్రమించుకున్న భూమిని స్థానిక నాయకులు తమ అనుచరులు, పార్టీ శ్రేణులకు మూడు సెంట్ల చొప్పున పంచిపెట్టేశారు. ఇంత కాలం వారి ఆగడాలను భరించిన భూయజమానులు రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో ధైర్యంగా తమ భూమి వద్దకు వెళ్లారు. తమ వద్ద ఉన్న పత్రాలను చూపించి అక్కడ ఇళ్లు కట్టుకుంటున్న వారిని నిలువరిస్తున్నారు.

ఎటువంటి పత్రాలు లేకుండానే నిర్మాణాలు

అధినాయకులు చూపించిందే తడవుగా స్థానిక కార్యకర్తలు అక్కడ పెద్ద పెద్ద భవంతుల నిర్మాణం చేపట్టేశారు. లక్షలు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు, సరైన పత్రాలు కూడా లేవన్న ఆలోచన మరిచి, తామే అధికారంలో ఉంటామన్న భ్రమ, తమను అడిగే నాథుడు లేడన్న అహంకారంతో పేట్రేగిపోయారు. ఒక్కొక్కరు రెండు, మూడు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. భవిష్యత్తులో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే ఏం చేయాలన్న తలంపు కూడా లేకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు.

కార్యకర్తలకు బహుమతిగా..

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లూ వైసీపీ నాయకులు తమ అనుచరులు, పార్టీ శ్రేణులకు యథేచ్ఛగా భూములు పంచిపెట్టారు. సాధారణంగా ఏ పార్టీ అయినా అధికారంలోకి వస్తే తమ పార్టీ శ్రేణులకు కాంట్రాక్టు పనులు ఇప్పించుకోవడం పరిపాటి. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గమనించిన పీలేరు వైసీపీ ముఖ్యనేతలు తమ పార్టీ శ్రేణులను అటువైపు ప్రోత్సహించలేదు. పనులు ఇప్పించడం, బిల్లులు ఇప్పించడం తలకు మించిన భారంగా మారుతుందని భావించిన వారు ప్రత్యామ్నాయంగా వారికి ఇళ్ల స్థలాలను ఆశగా చూపెట్టారు. ఒకవైపు జగనన్న కాలనీల్లో లెక్కకు మించి ఇళ్లు మంజూరు చేస్తూనే మరోవైపు ప్రైవేటు భూముల్లోనూ వారికి ఇళ్ల స్థలాలు కట్టబెట్టారు. దీంతో గత నాలుగేళ్లుగా పీలేరు పట్టణంతో పాటు మండలంలోని అధిక శాతం వైసీపీ శ్రేణులకు అటు జగనన్న కాలనీలు, ఇటు ప్రైవేటు భూముల వ్యవహారాలు ఆదాయ మార్గాలుగా మారాయి. సామాన్య వైసీపీ కార్యకర్త సగటున మూడు ఇళ్లు సంపాదించుకున్నాడంటే అతిశయోక్తి కాదు. ఇక కాసింత పరపతి, పదవుల్లో ఉన్న వారి సంపాదనకు లెక్కలేదు. అధికారం మారిన తరువాత ఒక్కొక్కరి లెక్కలు తేలుతున్నాయి. గూడరేవుపల్లె పంచాయతీ పరిధిలోని సర్వే నెం.757లోని భూమిలోనే ఒక్కొక్క కార్యకర్త, నాయకుడికి మూడు ఇళ్లు ఉన్నట్లు బయటపడుతోంది.

కిశోర్ గెలుపుతో బాధితుల్లో ఆత్మస్థైర్యం

ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి గెలుపుతో గత ఐదేళ్ల కాలంలో వైసీపీ నాయకులకు భూములు కోల్పోయిన వారితో ఆత్మస్థైర్యం కలిగించింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైసీపీ నాయకుల భూఆక్రమణలపై కిశోర్ అవిశ్రాంతంగా పోరాడారు. బాధితులు ముందుకు రాకున్నా సాంకేతిక ఆధారాలతో అటు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు, ఇటు లోకాయుక్తకు ఫిర్యాదు చేయడమే కాకుండా క్షేత్రస్థాయిలో పోరాడారు. ఇక ఆయనే గెలవడంతో వారందరూ తమకు న్యాయం చేయాలని కిశోర్‌ను ఆశ్రయించారు. ఇటీవల తనను కలిసిన రెవెన్యూ అధికారుల వద్ద సైతం ఆక్రమణల గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. ఐదేళ్లలో వైసీపీ నాయకులు ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోలేదని, చివరకు కేవీపల్లె మండలంలో సాక్షాత్తు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం కోసం కేటాయించిన భూమిని సైతం వైసీపీ నాయకులు తప్పుడు సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే చర్యలు తీసుకోలేదని గట్టిగా నిలదీశారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి పీలేరులో గత ఐదేళ్లలో జరిగిన భూవ్యవహారాలపై విచారణ చేయిస్తానని ఆయన ప్రకటించారు. ఆ ప్రకటనతో చాలా మంది బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని స్థానిక టీడీపీ నాయకుల ముందు పెడుతున్నారు. ఎమ్మెల్యేగా కిశోర్ ప్రమాణస్వీకారం అయిన వెంటనే విచారణకు సంబంధించిన చర్యలు ఉంటాయని, అన్యాయానికి గురైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని టీడీపీ వర్గాలు భరోసా కల్పిస్తున్నాయి.



ప్రభుత్వం మారినా.. అధికారుల తీరు మారలేదు

- ప్రభుత్వాస్పత్రి వద్ద వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కౌంటర్
- విస్తుపోతున్న రోగులు, ప్రజలు



మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో ఆరోగ్యశ్రీ కౌంటర్‌కు వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పేరు, ఫొటో తొలగించని అధికారులు

మదనపల్లె టౌన్, జూన్ 20: రాష్ట్రంలో ప్రభుత్వం మారింది..సంక్షేమ పథకాలను మార్చకపోయినా, వాటి పేర్లను మార్చాలని తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయినా మదనపల్లెలోని సర్వజన బోధనాస్పత్రి వద్ద మాత్రం అధికారులు సంక్షేమ పథకాలకు పాత పేర్లనే ఉంచడం వారి తీరు మారలేదనడానికి నిదర్శనంగా నిలుస్తోంది. మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి క్యాజువాలిటీ వద్ద గతంలో ఇటీవల కొత్తగా (ఎన్నికలకు ముందు) వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కౌంటర్ ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక ఈ కౌంటర్ వద్ద వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పేరు కనిపించకుండా పేపర్లు అతికించారు. కాగా ఇటీవల రాష్ట్రంలో ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పాటు, చంద్రబాబు హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలకు పాత పేర్లను ఉంచాలని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మదనపల్లెలో మాత్రం ఆస్పత్రి అధికారులు సంక్షేమ పథకాలకు పేర్లు మార్చకుండా (కనీసం పేపర్లు అతికించకుండా) అలాగే ప్రదర్శిస్తున్నారు. రెండు రోజులుగా ఆస్పత్రికి వచ్చే రోగులు, ప్రజలు ఆరోగ్యశ్రీ కౌంటర్ వద్ద వైఎస్ఆర్ ఫొటో, ఆయన పేరుతో ఆరోగ్యశ్రీ పేర్లు చూసి విస్తుపోతున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.



సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలపై తొలగని జగన్ బొమ్మ

ములకలచెరువు, జూన్ 20: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసి వారం రోజులు గడుస్తోంది. మంత్రులు కూడా తమ బాధ్యతలు స్వీకరిస్తున్నారు. అయితే గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల అధికారులకు మాత్రం కొత్త ప్రభుత్వం వచ్చినట్లుగా లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్నా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలపై మాత్రం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలు అలాగే ఉన్నాయి. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలకు వస్తున్న ప్రజలు జగన్ బొమ్మ చూసి షాక్‌కు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకుని గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలపై ఉన్న చిత్రపటాలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.



ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుండాలి

- డీఆర్‌వో సత్యనారాయణ

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 20: ప్రజల సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు ఎల్లవేళలా ముందుండాలని డీఆర్‌వో సత్యనారాయణ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో రెవెన్యూ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ యంత్రాంగం ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. ప్రతి సోమవారం ప్రజావేదికలో ప్రజల నుంచి వచ్చే అర్జీలు వెంటనే పరిష్కరించనప్పుడే ప్రజలకు సేవ చేసినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నరసింహకుమార్ మాట్లాడారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో ఉత్తమ సేవలందించిన పలువురు విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో గోవింద్‌సింగ్, గ్రామ, మండల, జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మోకాళ్లపై తిరుమలకు

- మొక్కు చెల్లించుకున్న టీడీపీ అభిమాని



శ్రీవారి మెట్టు మార్గంలో మోకాళ్ల మీద నడక ప్రారంభిస్తున్న గౌరి

కలికిరి, జూన్ 20: మండలంలోని గుట్టపాలెం పంచాయతీ యల్లంపల్లెకు చెందిన గౌరి అనే టీడీపీ వీరాభిమాని అయిన బీసీ మహిళ తిరుమల శ్రీవారికి గురువారం వినూత్న రీతిలో క్లిష్టతరమైన మొక్కు చెల్లించుకున్నారు. పీలేరు నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి గెలుపొంది, రాష్ట్ర సీఎంగా చంద్రబాబు పగ్గాలు చేపడితే మోకాళ్ల మీద నడుస్తూ తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుంటానని మండలంలోని గుట్టపాలెం పంచాయతీకి చెందిన మల్లికార్జున గౌడ్ భార్య గౌరి ఎన్నికల సమయంలో మొక్కుకుంది. ఆమె రెండు కోర్కెలు నెరవేరడంతో అలివేలుమంగాపురం వద్ద శ్రీవారి మెట్టు నడక మార్గంలో మొక్కు చెల్లించడానికి సిద్ధమైంది. ఈ మేరకు మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, గుట్టపాలెం మాజీ సర్పంచు కేవీ రెడ్డి, విజయకుమార్ రెడ్డి, జ్ఞానమూర్తి, జనార్ధన, మునాఫ్, మధుసూదనరెడ్డి తదితరులు వెంటరాగా శ్రీవారి మెట్టు పాదాల వద్ద గురువారం ఉదయం 6 గంటలకు పూజలు నిర్వహించి మోకాళ్ల మీద నడక సాగించింది. భర్త మల్లికార్జున, కుమారుడు కూడా ఆమెను అనుసరించారు. శ్రీవారి మెట్టు మార్గంలో మొత్తం 2388 మెట్లున్నాయి. అలిపిరి నడక మార్గంకన్నా శ్రీవారి మెట్టు మార్గం అత్యంత క్లిష్టతరమైంది. ఆమె మధ్యాహ్నం 3.30 గంటలకు తిరుమలకు చేరుకుంది. ఈ సందర్భంగా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఫోనులో గౌరి, ఆమె భర్త మల్లికార్జునను పరామర్శించి అభినందించారు. గౌరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

వ్యవసాయ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

కలికిరి, జూన్ 20: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్లకు 2024-25 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగించారు. గత నెల 31న జారీ అయిన నోటిఫికేషన్ మేరకు దరఖాస్తులు పంపుకోవడానికి జూన్ 20న చివరి తేదీగా నిర్ణయించారు. ప్రస్తుతం జూన్ 30వ తేదీ వరకూ దరఖాస్తులు పంపుకొనేందుకు వీలుగా గడువు పెంచారు. వ్యవసాయం, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ వ్యవసాయం, వ్యవసాయ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో రెండు లేక మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు పొందడానికి ఈ సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణులయిన వారు మాత్రమే అర్హులు. దరఖాస్తులను ఎన్జీ రంగా యూనివర్శిటీ వెబ్‌సైట్ ద్వారా పంపుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఇతర వివరాల కోసం 80081 04977, 90005 23420, 80085 54448 నెంబర్లలో సంప్రదించవచ్చు.

మృతికి కారకులను అరెస్టు చేయాలి

- చేనేత కార్మికుడిని మోసం చేసిన నలుగురు
- జీహెచ్‌టీ ఎదుట చేనేత కార్మికుల రాస్తారోకో



రమేశ్ ఆత్మహత్యకు ముందు బ్యాగుపై రాసిన సూసైడ్‌నోట్

మదనపల్లె టౌన్, జూన్ 20: మదనపల్లె పట్టణం మారుతీనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు ఆర్.రమేశ్‌బాబు ఆత్మహత్యకు కారణమైన నలుగురిని అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ చేనేత కార్మికులు స్థానిక సర్వజన బోధనాస్పత్రి (జీహెచ్‌టీ) ఎదుట గురువారం రాస్తారోకో చేశారు. చేనేత కార్మికుడు జి.రమేశ్‌బాబు కురబలకోట మండలం మల్లయ్యకొండ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. తన చావుకు ముగ్గురు వ్యక్తులు కారణమంటూ రమేశ్‌బాబు సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో గురువారం రమేశ్ కుటుంబీకులు, స్థానిక చేనేత కార్మిక సంఘం నాయకులు జీటీహెచ్ వద్దకు వచ్చి జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ భార్య సుశీల, చేనేత కార్మికులు మాట్లాడుతూ రమేశ్ కుటుంబ పోషణకు రెండు మరమగ్గాలు వేసి చీరలు నేస్తూ జీవనం సాగిస్తున్నాడన్నారు.

పట్టణంలోని కాట్లాటపల్లె రోడ్డులో ఇదే ప్రాంతానికి చెందిన పురాణం చంద్రశేఖర్, పురాణం రత్నకుమార్, శివారెడ్డి, వెంకటేశ్‌చంద్ర అనే నలుగురి వద్ద రమేశ్ ఇంటి స్థలం కొనుగోలు చేశాడన్నారు. స్థలం కొనుగోలుకు అప్పులు చేసి డబ్బులు చెల్లించాడన్నారు.

కానీ ఆ స్థలాన్ని విక్రయించిన నలుగురు రిజిస్ట్రేషన్ చేయించకపోవడం, దీంతో పాటు ఆ స్థలంలోకి రమేశ్‌ను రానీయకుండా శిబ్బల ప్రసాద్, శ్రీకాంత్ అనే ఇద్దరు కబ్జా చేశారని ఆరోపించారు. తన భర్త ఆత్మహత్యకు కారణమైన వారిని అరెస్టు చేసి శిక్షించాలని రమేశ్ భార్య సుశీల డిమాండ్ చేసింది. కాగా రాస్తారోకోతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో వన్‌టౌన్ సీఐ వలీబసు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. రాస్తారోకో చేయడం వలన ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని, ముదివేడు పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని చెప్పడంతో ఆందోళనకారులు రాస్తారోకో విరమించారు. రమేశ్ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం అతడి కుటుంబీకులు మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్లారు.



మదనపల్లె జీటీహెచ్ ఎదుట జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న చేనేత కార్మికులు

అసెంబ్లీలోకి.. తొలి అడుగు

- జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు
- నేడు ప్రమాణస్వీకారం..










(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ముగ్గురు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు తొలిసారిగా....... అను నేను.. శాసనం ద్వారా నిర్మితమైన.. భారత రాజ్యాంగం పట్ల... నిజమైన విశ్వాసం.. విధేయతను చూపుతానని.. భారతదేశ సార్వభౌమాధికారాన్ని.. సమగ్రతను కాపాడుతానని.. అంటూ జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు తొలిసారి ప్రమాణస్వీకారం చేయబోతున్నారు.. జిల్లా పరిధిలో ఆరు అసెంబ్లీ స్థానాలు ఉండగా.. అందులో నాలుగింటిలో తెలుగుదేశం, రెండింటిని వైసీపి గెలుచుకుంది. వీటిలో రాయచోటి, పీలేరు, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు తొలిసారిగా ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీళ్లందరూ శుక్రవారం రాష్ట్ర శాసనసభలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.

రాయచోటి నియోజకవర్గం వైసీపీకి కంచుకోట లాంటిది. 2009 నుంచి ఇక్కడ గడికోట శ్రీకాంత్‌రెడ్డి వరుసగా గెలుస్తూనే వస్తున్నారు. 2012 ఉపఎన్నిక, 2014, 2019 సాధారణ ఎన్నికల్లో వైసీపి ఇక్కడ భారీ మెజార్టీతో గెలుపొందింది. దీంతో రాయచోటి నియోజకవర్గంలో ఇక వైసీపీకి ఎవరూ ఓడించలేరేమో అనే అభిప్రాయం సర్వత్రా నెలకొని ఉంది. అయితే దానిని పటాపంచలు చేస్తూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విజయకేతనం ఎగురేశారు. వైసీపీకి సంప్రదాయకంగా ఉండే ఓటర్లను తమవైపు తిప్పుకున్నారు. దీంతో శ్రీకాంత్‌రెడ్డికి ఈసారి భంగపాటు తప్పలేదు. రాంప్రసాద్‌రెడ్డి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపుతో పాటు మరో బంపర్‌ను ఆఫర్ కొట్టేశారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో చోటు సంపాదించారు. రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రిగా పదవి దక్కించుకున్నారు. 62 సంవత్సరాల రాయచోటి నియోజకవర్గ చరిత్రలో మొదటిసారి మంత్రిగా రికార్డు సృష్టించారు. తన 20 సంవత్సరాల కలను నిజం చేసుకుంటూ.. నేడు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

పీలేరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి తొలిసారిగా గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సుమారు 20 సంవత్సరాలుగా ఇక్కడ గెలుపొందలేదు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు కాంగ్రెస్ పార్టీ తర్వాత వైసీపీ విజయభావుటా ఎగురేస్తూ వస్తోంది. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పసుపుజెండా ఎగురేశారు. తన ప్రత్యర్థి చింతల రామచంద్రారెడ్డి పైన 25 వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. ఈయన కూడా నేడు ఎమ్మెల్యేగా తొలిసారి ప్రమాణస్వీకారం చేయనున్నారు.

ఉమ్మడి కడప జిల్లాలో ఒకప్పటి తెలుగుదేశం పార్టీకి కంచుకోటలా ఉన్న రైల్వేకోడూరు నియోజకవర్గం తర్వాత వైసీపీకి పెట్టని కోటలా మారింది. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున కొరముట్ల శ్రీనివాసులు గెలుపొందారు. తర్వాత 2012 ఉప ఎన్నిక, 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపి తరఫున కొరముట్ల శ్రీనివాసులు వ రుసగా గెలుపొందారు. ఇక్కడ కూడా ఇక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడించడమే కష్టం అనుకున్న సమయంలో జనసేన జెండాను పాతింది. కూటమి అభ్యర్థిగా జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ గెలుపొందారు. నేడు ఎమ్మెల్యేగా ఆయన ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆ నియోజకవర్గాలలో తెలుగుదేశం పార్టీ గెలవడమే ఇక సాధ్యం కాదనుకున్న పరిస్థితుల్లో గెలిచి పసుపు జెండాను ఎగురేసిన ముగ్గురు శాసనసభ్యులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. శాసనసభ్యులుగా శాసనసభలో తొలిసారి వారు అడుగుపెట్టబోతున్నారు.



వారసత్వ పరిరక్షణకు దిక్సూచి 'మన చరిత'

వైవీయూ వైస్ చాన్సలర్ చింతా సుధాకర్



మన చరితను ఆవిష్కరిస్తున్న వైస్ చాన్సలర్ చింతా సుధాకర్, ఇంటాక్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 20 : మన జిల్లా సంస్కృతి వారసత్వ పరిరక్షణతో పాటు పర్యాటకాభివృద్ధికి మన చరిత బులిటిన్ దిక్సూచి లాంటిదని వైవీయూ వైస్ చాన్సలర్ చింతా సుధాకర్ అన్నారు. గురువారం ఇంటాక్ ఆధ్వర్యంలో మన చరిత బులిటిన్‌ను ఆయన ఆవిష్కరించారు. కడప నగరం మానస ఇన్ సమావేశ మందిరంలో ఇంటాక్ కన్వీనరు లయన్ కె.చిన్నపరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ మాట్లాడుతూ మన జిల్లాలో ఘనమైన వారసత్వ ప్రదేశాలు, చారిత్రక కట్టడాలు, విలక్షణమైన సంస్కృతీక సాంప్రదాయాలు న్నాయన్నారు. వీటి పరిరక్షణకు ప్రభుత్వంతోపాటు ఇంటాక్ లాంటి సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వారసత్వ సంపదను రక్షించుకోగలిగితే జిల్లా పర్యాటకంగా కూడా అభివృద్ధి చెంది ప్రభుత్వానికి ఆదాయం రాడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. చిన్నపరెడ్డి మాట్లాడుతూ జిల్లా వారసత్వ సంస్కృతి సాంప్రదాయ రక్షణ విషయంలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడంతోపాటు ఈ యజ్ఞంలో అందరినీ బాగస్వాముల చేసేందుకు ఈ బులిటిన్‌కు రూపకల్పన చేశామన్నారు. ఇంటింటా ఇంటాక్ నినాదంతో ప్రతి ఇంటా మన చరిత ఉండేలా రచనలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. సభ్యత్వం పెంచుకోవడంతో ముందడుగు వేయగలమన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంటాక్‌ను జిల్లా నలుమూలలా విస్తరింపజేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఈశ్వర్‌రెడ్డి, ఇంటాక్ పూర్వకన్వీనరు ఇలియాస్‌రెడ్డి, వాసవీ గ్రాఫిక్స్ అధినేత సీవీ రమేశ్, కోకన్వీనరు సుబ్బారెడ్డి, గోసుల వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇంటాక్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఇరువురికి తీవ్రగాయాలు

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు



దాడిలో గాయపడిన గణేష్

కడప (క్రైం), జూన్ 20 : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో రాజీవ్ పార్కు సమీపంలోని ఓ కర్రీస్ దుకాణం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... విష్ణువర్ధన్ ఆలియాస్ విష్ణు, నాని, నరసింహాచారి ఆలియాస్ నరసింహకు, గణేశ్ ఆలియాస్ సంజు, ఓబులేసు ఆలియాస్ బబ్లూలపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఎర్రముక్కపల్లె రైల్వేగేటు మార్గమధ్యంలో షేక్ మస్తాన్, గణేశ్, ఓబులేసు అనే ముగ్గురు మద్యం సేవించారు. కర్రీస్ కోసం రాజీవ్ పార్కు వైపు మోటారు సైకిల్‌లో ఆ ముగ్గురు వచ్చారు. అక్కడ గతంలో మనస్పర్థలు ఉన్న విష్ణువర్ధన్, నాని, నరసింహాచారి ఎదురుపడడంతో మొదట ఒకరికొకరు వాగ్వివాదం చేసుకున్నారు. తరువాత ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో గణేశ్‌కు వీపుపై గాయాలయ్యాయి. ఓబులేసుకు చేతికి, కుడి వైపు చెవికి గాయాలయ్యాయి. ఈ సంఘటనలో షేక్ మస్తాన్ స్వల్పంగా గాయపడ్డాడు. ఈ సంఘటనపై కడప వన్‌టౌన్ సీఐ భాస్కర్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. నిందితుల్లో విష్ణువర్ధన్, నరసింహ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. నానీ పరారీలో ఉన్నాడు. ఈ సంఘటనపై బాధితుల్లో ఒకరైన షేక్ మస్తాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

హరిత హోటల్‌లో ఏసీలు, గీజర్‌లు చోరీ

కడప (క్రైం), జూన్ 20 : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని హరిత టూరిజం హోటల్‌లో చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు దాదాపు రూ.50 వేల విలువైన సామగ్రిని అపహరించుకుని వెళ్లారు. పోలీసుల వివరాల మేరకు... హోటల్ ముందుభాగాన రోడ్డు, కాల్వ నిర్మాణం పనుల వల్ల ఏసీ ఇన్‌డోర్‌లు, ఔట్ డోర్‌లు, గీజర్లను పక్కకు తీసి ఉంచారు. దీనిని ఆసరాగా చేసుకున్న దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటనపై హరిత హోటల్ మేనేజరు మల్లికార్జున పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ సంఘటనపై సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరి మృతి

చాపాడు, జూన్ 20: మండలంలోని వెదురూరు గ్రామంలో గురువారం ఒక వ్యక్తి (29) తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బేల్దారి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. కొంత కాలంగా అప్పుల బాధతో సతమతమవుతూ ఉండేవాడని తెలిపారు. ఇటీవల అప్పులు ఎక్కువ కావడంతో డబ్బులిచ్చినవారు వత్తిడి చేయడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

చైర్మన్ పదవికి రాజీనామా

వీరపునాయునిపల్లె, జూన్ 20: మండలంలోని సంగమేశ్వర ఆలయం చైర్మన్ పదవికి ఎన్‌పి శివాంజనేయరెడ్డి రాజీనామా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చైర్మన్‌గా ఎన్నికైన ఆయన ఆలయ అభివృద్ధికి కృషి చేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తన పదవికి స్వచ్ఛందంగా రాజీనామాను అందించినట్లు తెలిపారు.

సుంకుసత్రం భూముల వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 20: సుంకుసత్రం భూములకు నిర్వహించిన వేలం పాటకు విశేష స్పందన లభించింది. గురువారం శివాలయం వీధిలో ఉన్న సుంకు వెంకటసుబ్బయ్య సత్రం ఈఓ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. సుంకుసత్రం సంబంధించి మాలేపాడులో సర్వేనంబరు 26లోని 162.17 ఎకరాల భూమికి వేలం నిర్వహించారు. 25 మంది పాల్గొన్నారు. మాలేపాడుకు చెందిన కె.సుబ్బారెడ్డి ఏడాదికి రూ.4.75 లక్షలు చెల్లించేలా వేలంపాట దక్కించుకున్నారు. గతంలో ఏడాదికి రూ.2.10 లక్షల ఆదాయం ఉండగా ఈ ఏడాది రూ.4 లక్షలకు పెరగడం హర్షణీయమని ఈఓ రామచంద్రాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహసింగ్, సుంకుసత్రం ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజశేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



మహిళకు సెల్‌ఫోన్‌ను అందిస్తున్న రైల్వే పోలీసు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 20 : ఇరువురు ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్లను రైలులో మరిచిపోగా ఆర్‌పీఎఫ్ పోలీసులు వాటిని గుర్తించి ప్రయాణికులకు అందించారు. ఈ ఘటన కడప రైల్వేస్టేషన్‌లో జరిగింది. అందుకు సంబంధించిన వివరాలను కడప ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. జయంతి ఎక్స్‌ప్రెస్‌లో ఒక ప్రయాణికుడు తన సెల్‌ఫోన్‌ను మరిచిపోయాడు. విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆ మొబైల్ ఫోన్‌ను గ్తురించి ఆర్‌పీఎఫ్ కార్యాలయంలో ఉంచారు. అలాగే తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో కూడా ఓ ప్రయాణికురాలు తమ మొబైల్ మరిచిపోయి ఇంటికి వెళ్లింది. దీన్ని గుర్తించిన ఆర్‌పీఎఫ్ పోలీసు ఆ మొబైల్‌ను కూడా కార్యాలయంలో ఉంచారు. మొబైల్స్ పోగోట్టుకున్న వ్యక్తులు తమ మొబైల్‌కు తిరిగి ఫోను చేయగా, ఆర్‌పీఎఫ్ కార్యాలయంలో ఫోన్లు ఉన్నాయని, తగిన ఆధారాలు తీసుకువచ్చి ఫోన్లు తీసుకుపోవాలని సూచించారు. ప్రయాణికులు తగిన ఆధారాలతో రాగా వారికి మొబైల్ ఫోన్ల ను ఆర్‌పీఎఫ్ అధికారులు అందించారు. ఈ మేరకు ఆర్‌పీఎఫ్ సిబ్బంది భాస్కరరావు, ప్రబాకర్‌రెడ్డి, అకీరాను ఆర్‌పీఎఫ్‌సీఐ శ్రీనివాసులు అభినందించారు.

'ఉపాధి'లో అవకతవకలు

● అవెన్యూ ప్లాంటేషన్‌లో కనబడని మొక్కలు ● లక్షల్లో ప్రజాధనం వృథా



ఎండిపోయిన మొక్కలకు కంప పాతిన దృశ్యం

కలసపాడు, జూన్ 20: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరిగాయి. అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా రోడ్లకిరువైపులా మొక్కలను పెంచేందుకు మహాత్మాగాంధి ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు వెచ్చించారు. అయితే నాటిన మొక్కలు ఎక్కడా కనిపించడం లేదు. ఈవిషయమై సంవత్సరం క్రితం కథనాలు కూడా వచ్చాయి. అప్పటి అధికార పార్టీ నాయకులు సంబంధిత ఉపాధి హామీ అధికారులు కుమ్మక్కై నిధులను స్వాహా చేశారు. దీనిపై ఓ మహిళా అధికారి పరిశీలనకు వచ్చి ఐదు రోజుల పాటు మండలంలో సమీక్ష నిర్వహించి ఎక్కడా అవకతవకలు జరగలేదంటూ... నివేదిక ఇచ్చి తూతూ మంత్రంగా కొద్దిపాటి అపరాధ రుసుము విధించి వెళ్లిపోయింది.

అవెన్యూ ప్లాంటేషన్‌లో కనిపించని మొక్కలు

కలసపాడు మండలంలో కరోనా తరువాత ప్రజలకు ఉపాధి హామీ పనుల ద్వారా రూ.2 కోట్ల పైచిలుకు అవెన్యూ ప్లాంటేషన్‌లో నిధులు వెచ్చించి మొక్కలు నాటారు. మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశారు. అనంతరం మొక్కలను రక్షించేందుకు చుట్టూ ముళ్ల కంపల ఏర్పాటుకు కూడా నిధులను వెచ్చించారని రికా ర్డుల్లో మాత్రం పొందుపరిచారు. కానీ ఎక్కడా కూడా అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా నాటిన మొక్కలు మాత్రం కనిపించడం లేదు. అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా తూతూ మంత్రంగా మొక్కలు నాటాం అన్నట్లుగా ఉంది.

ట్యాంకర్లతో నీరు తోలితే మొక్కలు ఎక్కడ?

మండలంలో దాదాపు 13 పంచాయతీల్లో 38 గ్రామాలు ఉన్నాయి. ప్రతి పంచాయతీకి ఒక ఫీల్డ్ అసిస్టెంటు ఉన్నాడు. అవెన్యూ ప్లాంటేషన్‌లో దాదాపు మండలంలోని పత్రి పంచాయతీలో వేసవి కాలంలో నీటిని తోలి మొక్కలను సంరక్షించామంటూ గతంలో పనిచేసిన మండల ఉపాధి హామీ అధికారి బిల్లులు చేశారు. కానీ ఆ మొక్కలు ఎక్కడ అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని లింగారెడ్డిపల్లె, రాజుపాలెం, కలసపాడు, మహానంది పల్లె, తెల్లపాడు, రామాపురం, చింతలపల్లె శంకవరం, పిడుగుపల్లె పంచాయతీల్లో ఎక్కువగా మొక్కలు నాటినట్లు బిల్లులు చేసుకున్నట్లు తెలుస్తుంది. ఈ విషయమై గతంలో కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు.

ప్రజాప్రతినిధులే ఉపాధి హామీ కూలీలు


మండలంలో ఉపాధి హామీ పథకం గత వైసీపీ ప్రజాప్రతినిదులు వారి అనుయాయుల ఆధ్వర్యంలోనే నడించింది. కలసపాడులో ఓ ప్రజాప్రతినిధి కొడుకు బంధువులు నిత్యం ఉపాధి పనులకు వెళతున్నట్లు వంద రోజులు పనిదినాలు నమోదయ్యాయి. అలాగే మరో నాలుగైదు పంచాయతీల్లో ఇదే విధమైన పరిస్థితి. కేవలం అధికారాన్ని అడ్డం పెట్టుకుని గతంలో ఏపీవోగా పనిచేసిన అధికారి ఇష్టానుసారం బిల్లుల చెల్లింపు చేశారని తెలుస్తోంది. ఈ విషయమై ప్రస్తుతం కలసపాడు మండల ఉపాధి హామీ అధికారిగా విధులను నిర్వహిస్తున్న శివశంకర్‌ను వివరణ కోరగా.. ఉపాధి హామీ పథకంలో అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా చేసిన పనులు మూడు సంవత్సరాలైందని, ఇందుకు సంబంధించిన రికార్డులు ఆన్‌లైన్‌లో లేవని, వాటిని ఆన్‌లైన్‌లో నుంచే తొలగించారని తెలిపారు.



మొక్కలు ఉన్నట్లు చూపిస్తున్న దృశ్యం

బీజేపీ సీనియర్ నాయకుడు

కొవ్వూరు బాలచంద్రారెడ్డి మృతి



కొవ్వూరు బాలచంద్రారెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు, జూన్ 20: బీజేపీ సీనియర్ నాయకుడు కొవ్వూరు బాలచంద్రారెడ్డి (67) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. పట్టణాభివృద్ధి సంఘం అధ్యక్షుడిగా ఆయన ప్రొద్దుటూరు ప్రజలకు అనేక సేవలందించారు. వృత్తిరీత్యా క్లాస్-1 కాంట్రాక్టర్. పేదల కోసం రొట్టే, పప్పు తక్కువ ధరకు అందించి అందరి మన్ననలు పొందారు. నిత్యావసర సరుకులు కూడా తక్కువ ధరకు అందించేలా స్టాల్స్ పెట్టారు. వర్షాలకు మడూరు కాల్వ పొంగి పేదల ఇళ్లలో నీరు చేరితే కాల్వలో తెప్ప వేసుకుని నిరసన చేపట్టారు. కాల్వ ఆధునీకరణ కోసం పోరాడాడు. వైసీపీ ప్రభుత్వంలో మున్సిపల్ అనిబీసెంటు హైస్కూల్‌లో కూరగాయల మార్కెట్ పెట్టవద్దని హైకోర్టులో కేసులు వేసి పోరాడాడు. అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ రాధ బాలచంద్రారెడ్డిపై కక్షకట్టి కోనేటి కాల్వ వీధిలో బాలచంద్రారెడ్డి కొత్తగా ప్రారంభించిన సూపర్ మార్కెట్‌కు అనుమతులు లేవని విద్యుత్ సరఫరా నిలిపివేయించి మూయించారు. దీంతో అతన్ని ఆర్థికంగా తీవ్రంగా నష్టపరిచడం అవమానించడంతో ఆయన వైసీపీ ప్రభుత్వంలో మానసిక వ్యధకు లోనయ్యారు. దీనికి తోడు తీవ్ర అనారోగ్యం ఆయనను వెంటాడి మృత్యువు కాటేసింది. ప్రొద్దుటూరులో కొవ్వూరు ఫ్యామిలీకి పేరుప్రఖ్యాతులున్నాయి. బాలచంద్రారెడ్డికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు సైతం కాంట్రాక్టరుగా పనిచేస్తున్నారు. 2004లో టీడీపీ, బీజేపీ అలయెన్సులో ప్రొద్దుటూరు బీజేపీ ఎమ్మెల్యేగా వరదరాజులరెడ్డిపై కొవ్వూరు బాలచంద్రారెడ్డి పోటీ చేసి ఓడిపోయాడు. బీజేపీ నేతగా కొన్నేళ్లుగా క్రియాశీలకంగా పనిచేశారు. ఇటీవల ఎన్నికల్లో వరదరాజులరెడ్డిని గెలిపించమని కూటమి సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల పోలింగ్‌కు ముందు వైసీపీని ఓడించమని వెంటిలేటర్ మీది నుంచే ఆయన పిలుపునిస్తూ వీడియో విడుదల చేశారు. బాలచంద్రారెడ్డి నిరంతర పోరాటయోధుడు. ఆయన మృతికి ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, టీడీపీ, బీజేపీ నేతలు పలువురు సంతాపం ప్రకటించారు.

గనులు, ఖనిజాల చెక్‌పోస్టులు ఎత్తేశారు

● మట్టి, చిన్న తరహా ఖనిజాల, రవాణా సినరేజ్ చార్జీలు రద్దు ● ప్రజలపై తగ్గిన ఆర్థిక భారం



సంబేపల్లె మండలంలో ఎత్తేసిన చెక్‌పోస్టు

సంబేపల్లె, జూన్ 20: జిల్లాలో వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన గనులు, ఖనిజాల చెక్‌పోస్టులను ప్రభుత్వం మారడంతో ఎత్తేశారు. ఉమ్మడి కడప జిల్లాలో విశేషమైన ఖనిజ సంపద ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఓ ప్రైవేటు సంస్థకు సినరేజ్ వసూళ్లకు గనులు, ఖనిజాలు తనిఖీ కేంద్రాల పేరిట చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ప్రజలపై ఆర్థిక భారాన్ని పెంచారు. మట్టి కూడా బంగారం అయ్యింది. మట్టితో సహా చిన్న తరహా ఖనిజాల రవాణాకు సీనరేజ్ వసూలు చేస్తూ తనిఖీలను ముమ్మరం చేశారు. ఇసుక, మట్టి ప్రజలకు భారం అయ్యింది. కొన్ని ప్రాంతాల్లో మట్టితో పాటు రాళ్ల ఉచితంగా తరలించేవారు. దోపిడీకి కళ్లెం వేయడం పేరిట ప్రైవేట్ సంస్థ సీనరేజ్ వసూల బాధ్యతలు చేపట్టారు. చెక్‌పోస్టులతో ప్రజలపై మరింత ఆర్థిక భారం పడింది.

ఉమ్మడి జిల్లాలో ఉన్న చెక్‌పోస్టులు ఇవే..

సంబేపల్లె, రాయచోటి, రామాపురం, కడప, రాజంపేట, యర్రగుంట్ల, వేముల, పులివెందుల, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో ఉండేవి. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెక్‌పోస్టులను ఎత్తేశారు.

నిర్మాణ వ్యయం భారంగా ఉండేది

రాయచోటి, సంబేపల్లె ప్రాంతాల్లో ప్రజలు పునాదుల అవసరాలకు కోసం బండరాళ్ళ, మట్టి, ఇసుక, కంకర అవసరాల ఉండేవి. ట్రాక్టర్ కంకర రూ.2500 ఉండేది. సీనరేజ్ వసూళ్లతో రూ.3200కు పెంచారు. మట్టి గతంలో 500 ఉండేది. ప్రస్తుతం 900 రూపాయలు చేశారు. ఇసుక రూ.3వేల నుంచి రూ.3500 ఉండేది. ప్రస్తుతం రూ.4 వేల నుంచి రూ.4500కు పెంచారు. ఇలా ప్రతి ఒక్కటి పెంచి వైసీపీ ప్రభుత్వంలో ప్రజలపై ఆర్థిక భారాన్ని పెంచారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో చెక్‌పోస్టులను రద్దు చేశారు. దీంతో మట్టి, ఇసుక, కంకర ధరలు తగ్గడంతో ప్రజలపై ఆర్థిక భారం తగ్గిందని చెప్తున్నారు.

ఐదేళ్లలో దోపిడీ చేశారు



వైసీపీ ప్రభుత్వంలో సహజ వనరులు ఇసుక, మట్టి, కంకర రాయి ప్రైవేటు సంస్థకు అప్పగించి సినరేజ్ పనుల పేరుతో డోపిడీ చేశారు. సామాన్య ప్రజలకు గృహ నిర్మాణ వ్యయం పెరిగి భారంగా మారింది. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఇలాంటి ఇబ్బందులు రావన్నారు.

– మల్లు నరసారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సంబేపల్లె

మహిళ బ్యాగు నుంచి బంగారు ఆభరణాలు చోరీ

కడప (క్రైం), జూన్ 20 : తన బ్యాగులోని బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని ప్రమీల అనే మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలానికి చెందిన పి.ప్రమీల దేవునికడపలో జరిగే బంధువుల వివాహానికి ఆర్టీసీ బస్సులో బయల్దేరింది. ఐటీఐ సర్కిల్ నుంచి సంధ్యా సర్కిల్‌కు వచ్చేలోపు తన బ్యాగు జిప్ తీయబడి ఉండడం ప్రమీల గమనించింది.

బ్యాగును తెరిచి చూసేసరికి అందులోని బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని గమనించి లబోదిబోమంది. సంఘటన జరిగిన తరువాత కడప వన్‌టౌన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనను విచారించి కడప వన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మెరుగైన విద్యాబోధన చేయాలి

డీఈఓ శివప్రకాశ్‌రెడ్డి

సంబేపల్లె, జూన్ 20: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనలు అందించాలని డీఈఓ శివప్రకాశ్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని యర్రగుంట్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులలో బోధనా నైపుణ్యాలపై పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి త్వరితగతినే పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందాయా లేదా అని ఆరాతీశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలియజేశారు. ఉపాధ్యాయులు భోదిస్తున్న పాఠ్యంశాలను విద్యార్థులతో కలసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు ఆర్థిక సాయం అందించాలి

వేంపల్లె, జూన్ 20: మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు ఆర్థికసాయం అందించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థికసాయం అందిస్తామని టీడీపీ తన మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రైతులకు ఆర్థిక సాయం చేసేందుకు ఇది సరైన సమయమన్నారు. అలాగే కర్నూలు నగరంలో ఉన్న మానవహక్కుల కమిషన్, లోకాయుక్త, వక్ఫ్, ట్రైబ్యునల్, ఆంధ్రప్రదేశ ఎలక్ట్రికల్ రెగ్యులేషన్ అథారిటీ తదితర ప్రభుత్వ కార్యాలయాలను అమరావతికి తరలించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు కొన్ని వార్తలు వచ్చాయని, తరలింపు ఆలోచన ఉంటే విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కడప జిల్లాలో ఉన్న యోగివేమన విశ్వవిద్యాలయం ప్రాంగణం నుంచి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించాలని కొందరు తెలుగుదేశం పార్టీ వారు వైస్ చాన్సలర్‌కు వినతి పత్రం ఇవ్వడం శోచనీయమన్నారు. రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ప్రతిష్టించి దాదాపు 16 సంవత్సరాలైందన్నారు. రాజశేఖర్‌రెడ్డి ఈ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు కావున ఆయన విగ్రహాన్ని తొలగించడం సమంజసం కాదని తులసిరెడ్డి అన్నారు.

గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



మృతుడు సంతోష్ (ఫైల్)

సంబేపల్లె, జూన్ 20: 'ఉన్నత చదువులు చదివించాం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చిందని సంతోషించాం.. కొడుకు ప్రయోజకుడయ్యాయడని అనుకునే లోపే చిన్న చూపు చూశావా దేవుడా' అని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. మండలంలోని నాగిరెడ్డిగారిపల్లె గ్రామం మొటుకువాండ్లపల్లెకు చెందిన విద్యుత్ లైన్ మెన్ చంద్రశేఖర్ పెద్ద కుమారుడు సంతోష్ (24) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బెంగళూరులో గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి స్నేహితుడి వివరాల మేరకు.. జిమ్‌కు వెళ్లి రూముకు వచ్చిన సంతోష్ గుండెపోటుకు గురి కావడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించి మృతుడి తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించామని, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాదుబాబు భౌతికగాయాన్ని సందర్శించి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గుర్తు తెలియని యువకుడు మృతి



గుర్తు తెలియని మృతదేహం

రైల్వేకోడూరు, జూన్ 20: పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహం టోల్గేట్ వద్ద ఉన్న టీ షాపు వద్ద గుర్తు తెలియని యువకుడు ఒక్కసారిగా గురువారం కుప్పకూలిపోయాడు. వెంటనే అక్కడ ఉన్న స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువకుడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వాసుపత్రికి వెళ్లి మృతుడి వివరాల కోసం వారు ఆరా తీశారు. ఎటువంటి సమాచారం తెలియకపోవడంతో ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ బాబు తెలిపారు.

లారీ - కారు ఢీ : నలుగురికి గాయాలు

ఒంటిమిట్ట, జూన్ 20: మండల పరిధిలోని కడప-చెన్నై జాతీయ రహదారిపై లారీ-కారు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కడప నుంచి రేణిగుంటకు వెళుతున్న లారీ, తిరుమల నుంచి కడపకు వెళుతున్న కారు ఢీకొనడంతో కడపకు చెందిన వెంకటనారాయణ(42) సాయి(13), పుణీత్, అనూహశ్రీ(32) అనే ముగ్గురు గాయపడ్డారు. వారిని రిమ్స్‌కు తరలించినట్లు హెచ్‌సీ రాజు తెలిపారు.

classified ఆంధ్రజ్యోతి lines

CHANGE OF NAME

I, LABBEH SHABEENA BEGUM (Old Name) R/o 8/209-1-15-29, Bismilla Nagar, Kadapa, YSR Dist., A.P. has changed my name as LABBEH SHABEENA FATHIMA (New Name) W/o LABBEH EAJAS AHMED AJC-000

CHANGE OF NAME

I, LABBEH FAJAS AHMED (Old Name) R/o 8/209-1-15-29, Bismilla Nagar, Kadapa, YSR Dist.,A.P. have changed my name as LABBEH EAJAS AHMED (New Name)S/o LABBEH BASHEER AHMED AJC-000

వంట మాస్టర్స్ కావలెను

కడప బకెట్ బిర్యాని హోటల్‌లో సౌత్ ఇండియన్ టిఫిన్ సెక్షన్ నందు వంట మాస్టర్ & ఏంజిల్స్ లేడీస్ హస్టల్ నందు లేడి వంట మాస్టర్ కావలెను. జీతం+ఫుడ్ సౌకర్యం కలదు. సెల్ : 98667 68892 Ajc-188767

కంప్యూటర్ ఆపరేటర్ కావలెను

కడప నగరంలోని బెస్ట్ ఫ్లెక్స్ ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్ నందు పనిచేయుటకు ఫోటోషాపు, డిజైనర్ వచ్చిన యువతి యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం : సెల్ : 6300154940 Ajc-188598

FLAT FOR SALE

తిరుపతి Smart City అతి పెద్ద గేటెడ్ కమ్యూనిటి గ్యారెంటి రెంటల్ పొందే 1,2,3 BHK Flats ప్రతి నెల 15,20,25వేలు పొందే అవకాశం. Flats 25 Lakhs నుండి మొదలు, సంప్ర:63002 91670 Ajt-4014

కావలెను

బాల మద్దిలేటి & సన్స్, హేర్ & బ్యూటీ సెలూన్ A/c లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. సంప్ర. సెల్ 98854 46126, 88974 76747, జీతం:18,000, రూమ్ సౌకర్యం కలదు. AJL-186473

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647 AJA- 189263

CHANGE OF NAME

★ I, Uppaluru Ghouse Lajam (Old Name) S/o Uppaluru Fakruddin R/o 19/167-1, Joke Palem Street, Proddatur-516360, Kadapa Dist, A.P. Now I Change My Name To Uppaluru Ghouse Lazam (New Name) AJH-002472

ఆంధ్రజ్యోతిలో ప్రకటనలకోసం సంప్రదించండి

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

సిద్దవటం, జూన్ 20: రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తహసీల్దారు మురాషావలి సిబ్బందికి సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మొదటగా 1786 సంవత్సరంలో భారతదేశంలో రెవెన్యూ బోర్డు ఏర్పడిందన్నారు. నాటి నుంచి నేటి వరకు రెవెన్యూశాఖ కీలకంగా ఉందన్నారు. అన్నిశాఖల సమన్వయంతో రెవెన్యూశాఖ ఎన్నికల నిర్వహణలో కీలకపాత్ర పోషించడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, కరోనా సమయంలో కీలకంగా వ్యవహరించిందన్నారు. ప్రజలను రెవెన్యూ సిబ్బంది కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా వారి పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రెవెన్యూ దినోత్సవంగా ప్రకటిస్తూ జీఓ నంబరు 81 జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మాధవిలత, ఏఎస్ఓ శివప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనురాధ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఒంటిమిట్ట, జూన్ 20: ఒంటిమిట్ట విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని ఒంటిమిట్ట, నందలూరు మండలాల్లోని అన్ని సబ్‌స్టేషన్లలో విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు ఏడీఈ మురళీధర్‌రెడ్డి తెలిపారు. 132/33 కేవీ ఒంటిమిట్ట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కేవీ ఒంటిమిట్ట, ఎస్‌కేఆర్, సాలాబాదు, మంటపంపల్లె, పాటూరు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్న కారణంగా ప్రజలు సహకరించాలని విద్యుత్ అధికారులు కోరారు.

నందలూరు: ఒంటిమిట్ట 132/33కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంటిమిట్ట డీఈఈ మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33/11కెవి ఒంటిమిట్ట, సాలాబాదు, మంటపంపల్లె, పాటూరు, సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మిగిలిన సీట్లకు దరఖాస్తులు

లక్కిరెడ్డిపల్లె, జూన్ 20: లక్కిరెడ్డిపల్లె సాంఘిక సంక్షేమ, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ విజయ ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 8, 9 తగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు చేసుకొన్న వారికి ఈ నెల 27న ఉదయం 9 గంటలకు లక్కిరెడ్డిపల్లె గురుకుల పాఠశాలలో పరీక్ష ఉంటుందని, అనంతరం మెరిట్ ప్రకారం ఎంపిక చేసి పాఠశాలలో చేర్చుకుంటామని ఆమె తెలిపారు.

శిథిలావస్థలో ఎస్సీ బాలుర వసతి గృహం

- కూలేందుకు సిద్ధంగా గదులు
- ఊడిపడుతున్న పైకప్పు పెచ్చులు
- నూతన భవనంలోకి మార్చాలంటున్న విద్యార్థులు



వసతిగృహంలో పై పెచ్చులు ఊడిపడిన దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, జూన్ 20: లక్కిరెడ్డిపల్లెలోని ఎస్సీ బాలుర వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. లక్కిరెడ్డిపల్లెలో 1983లో అప్పటి సీఎం స్వర్గీయ ఎన్టీ రామారావు హయాంలో ఎస్సీ-1, ఎస్సీ-2 హాస్టళ్లు నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్నో ప్రభుత్వాలు మారినా దీన్ని పట్టించుకునేవారు కరువయ్యారు. ఈ రెండు హాస్టల్స్‌కు ఇద్దరు హెచ్ డబ్ల్యూఓలు, 6 మంది సిబ్బంది ఉన్నారు. వసతి గృహాలు నిర్మించి సుమారు 40 సంవత్సరాలు కావస్తోంది. రూములన్నీ శిథిలావస్థకు చేరుకొని పైపెచ్చులు ఊడి కిందపడడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 8 రూములు ఉండగా, అందులో మూడు పెద్ద రూముల్లో పై పెచ్చులు ఊడిపడ్డాయి. రేపోమాపో బిల్డింగ్ మొత్తం కూలిపోయే పరిస్థితి ఉందని అంటున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు చదువులు అభ్యసిస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైనా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పలు విమర్శలు వస్తున్నాయి. తద్వారా విద్యార్థులు హాస్టల్‌లో చేరేందుకు మక్కువ చూపలేకపోతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఎస్సీ బాలుర హాస్టల్

గడిచిన 5 ఏళ్లలో వైసీపీ ప్రభుత్వంలో హాస్టల్స్ గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లు ఉంది. పాత గదుల్లో పై పెచ్చులు పడుతుంటే విద్యార్థులు ఉండలేక రెండు వసతి గృహాల్లో విద్యార్థులు చేరాలంటేనే భయపడుతున్నారు. ఒకప్పుడు ఒక్కో హాస్టల్‌లో 300కు పైగా విద్యార్థులు విద్యనభ్యసించేవారు. ఇప్పుడు ఎక్కడ రూములు కూలిపోతాయోనని భయంతో ససేమిరా అంటున్నారు. ఎప్పుడో నిర్మించిన భవనాలు చాలా అధ్వానంగా ఉన్నాయని, ఏ అధికారులు పట్టించుకోవడం లేదని పిల్లల తల్లిదండ్రులు అంటున్నారు. అంతేకాక మంచినీటి బోరు ఉన్నా అది ఉపయోగంలో లేక చెడిపోయింది. ఉన్న అరకొర మందికి గ్రామ పంచాయతీ బోరు నుంచి వచ్చే నీటిని సంపుకు నింపుకొని ఆ నీటినే ఉపయోగించుకుంటున్నారు. పైగా హాస్టల్ వెనుక ఉన్న కమ్యూనిటీ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసే గది ఉండడంతో భయంతో వణికిపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆఫీసు గది, వంటగది మరీ అధ్వానంగా ఉంది. పేరుకే మినరల్ వాటర్ ప్లాంట్. అందులో నుంచి విద్యార్థులు ఒక్కరోజు కూడా మంచినీరుతాగిన పాపాన పోలేదని అంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా హాస్టల్‌ను నూతన భవనంలోకి మార్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

-శ్రీనివాసులు, హెచ్‌డబ్ల్యూఓ

హాస్టల్ గదులు శిథిలావస్థలో ఉన్నాయన్న విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారులు వచ్చి పరిశీలించారు. నివేదికలు పంపించి నూతన భవనానికి ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరానికి అద్దెభవనాల్లో ఏర్పాటు సిద్ధం చేస్తున్నారు.



కూలేందుకు సిద్ధంగా ఉన్న వంటగది

నేడే బ్రహ్మాండమైన విడుదల



నంద్యాల	-	ఎఆర్ మినీ
కడప	-	ఎస్ ఆర్ సాయిబాబా
అనంతపురం	-	గంగ
రాజంపేట	-	ఎస్ఎస్ఆర్ థియేటర్
రాయచోటి	-	గౌతమ్

CONTACT: 95507 40061

నేడే బ్రహ్మాండమైన విడుదల



తిరుపతి	-	శ్రీనివాస తేజ
మదనపల్లి	-	మినీ సిద్ధార్థ
చిత్తూరు	-	గుర్నాథ్
చిత్తూరు	-	ఆనంద్ స్క్రీన్-6
నంద్యాల	-	సంగీత
అనంతపురం	-	తేజశ్విని
కడప	-	ప్రతాప్
ప్రొద్దుటూరు	-	కళ్యాణ్ స్క్రీన్-3
రాజంపేట	-	సమద్
ఎమ్మిగనూరు	-	మినీ శ్రీనివాస

SUCHIN CINEMAS 95507 40061

వైభవంగా నడివీధి గంగమ్మకు పొంగళ్లు

పుల్లంపేట, జూన్ 20: పుల్లంపేట మండల పరిధిలోని సీతారాజంపేట గ్రామంలో గురువారం గ్రామదేవత నడివీధి గంగమ్మకు మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగుబాళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా మామిడి తోరణాలు, వేపాకు పందిరిలు వేసి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. గ్రామస్థులు పొంగుబాళ్ల సందర్భంగా బంధువులను పిలిపించుకుని విందు భోజనాలు చేశారు. రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మీ అమ్మవారికి పూజలు చేశారు. అలాగే పుల్లంపేట హరిజనవాడలో గంగమ్మకు పొంగుబాళ్లు పెట్టి వైభవంగా జాతర నిర్వహించారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

సిద్దవటం, జూన్ 20: మండలంలోని జంగాలపల్లె, వెలుగులపల్లె, వంతాటిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల విద్యాసామగ్రి, పలకలు, నోటు పుస్తకాలు, పెన్సిల్, పెన్నులు తదితర వాటిని ఉపాధ్యాయులు ప్రసాద్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రులను ప్రతిఒక్కరూ పూజించాలని, మనం ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నామంటే తల్లిదండ్రుల కృషే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ విలియం రాజు, కుప్పం వెంకటసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, మాచునూరు వెంకటసుబ్బారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాడీఫ్రీజర్ వితరణ



బాడీ ఫ్రీజర్ బాక్సును అందజేస్తున్న దృశ్యం

నందలూరు, జూన్ 20: మానవతాసేవ సంస్థ, లయన్స్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల ప్రజల అవసరార్థం మరణించిన వారి కోసం బాడీ ఫ్రీజర్‌ను మండెం సీతారామయ్యగౌడ్ తన సొంత నిధులతో అందజేశారు. ఇప్పటికే ఉన్న బాడీఫ్రీజర్ బాక్సులకు అదనంగా మరొకటి అందజేసిన మండెం సీతారామయ్యగౌడ్‌ను సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన లయన్ మన్యం రామ్మోహన్ మాట్లాడుతూ దాత సీతారామయ్యగౌడ్‌ను అభినందిస్తూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడానికి మరింత మంది ముందుకు వచ్చి పేద అవసరాలు తీర్చడానికి దోహదపే కార్యక్రమాలను చేయాలని ఆకాంక్షించారు. అనంతరం లయన్ కుర్రా మణియాదవ్, గుణయాదవ్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్యలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాము, గంగాధర్, వెంకటయ్య, గురుప్రసాద్, రాజాచారి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భువనేశ్వరి జన్మదిన వేడుకలు



భువనేశ్వరి జన్మదిన శుభాకాంక్షలను వినూత్నరీతిలో చూపుతున్న విద్యార్థులు, కేకు కట్ చేస్తున్న బాలసుబ్రమణ్యం, టీడీపీ నేతలు

రాజంపేట, జూన్ 20: సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో భువనేశ్వరి జన్మదిన వేడుకల సందర్భంగా కేక్‌ను కట్‌చేసి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యల్లో భాగంగా చంద్రబాబునాయుడుపై తప్పుడు కేసులు బనాయించారన్నారు. రాజకీయాలకు దూరంగా ఉన్న భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేసి ఆమె ఆవేదనను రాష్ట్ర ప్రజలకు వినిపించారన్నారు. దుర్మార్గపు వైసీపీ పాలనకు చరమగీతం పాడిన మహిళాశక్తి భువనేశ్వరి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డి.సుబ్రమణ్యంనాయుడు, గన్నే సుబ్బనరసయ్య, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మల్లెల శ్రీవాణి, సంజీవరావు, బాసినేని వెంకటేశ్వర్లు నాయుడు, బాపనయ్యనాయుడు, గీతాంజలి రమణ, నాగమునిరెడ్డి, అదృష్టదీపుడు, ఇడిమడకల కుమార్, చెంగల్‌రాయుడు, కరీం, రెడ్డయ్య, సురేంద, మేక నరసింహులు, గుడారు విష్ణు పాల్గొన్నారు.

టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో...

నారా భువనేశ్వరి జన్మదిన వేడుకల సందర్భంగా రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం భారీ కేక్‌లు కట్‌చేసి ఒకరినొకరు తినిపించుకుని భువనేశ్వరి జన్మదిన శుభాకాంక్షలను వినూత్నరీతిలో పిల్లలతో చెప్పించారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఆమె జీవితాన్ని పేద ప్రజలకు అంకితం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు శ్రీనివాసులు, రెడ్డిశేఖర్, శివప్రసాద్, యానాది, జ్యోతి శివ, నవీన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రత్యేక గ్రామ సభలు

లక్కిరెడ్డిపల్లె, జూన్20: గ్రామంలోని సమస్యల పరిష్కారం కోసమే ప్రత్యేక గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ పట్నాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామంలో ప్రత్యేక గ్రామ సభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలను అడగగా.. గ్రామస్థులు జోక్యం చేసుకొని గ్రామంలో ముఖ్యంగా తాగునీరు, వీధిదీపాలు, డ్రైనేజి, ఉపాధి పనులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే దండేవాండ్లపల్లెకు రోడ్డు ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు అధికారులను కోరారు. హరిజనవాడలో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని, మెయిన్ రోడ్డు నుంచి హరిజనవాడలోకి రోడ్డు ఏర్పాటు చేయాలని వారు కోరారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. అడిగిన ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలని సర్పంచు భూదేవమ్మ ఉపాధి సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, ఏపీఓ పెంచలయ్య, మాజీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గట్టువారిపల్లెలో వైభవంగా గంగమ్మ జాతర

పెనగలూరు, జూన్ 20: మండలంలోని గట్టువారిపల్లె గ్రామంలో వెలసి ఉన్న గ్రామ దేవత గంగమ్మ జాతర గురువారం వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు జాతర కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించుకున్నారు. మూడు రోజుల పాటు సంప్రదాయబద్ధంగా గంగమ్మకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గువారం తెల్లవారుజాము నుంచి గంగమ్మ ప్రతిమతో పోతులరాజు విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం తలపెట్టి వీధుల్లో ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో ప్రతి ఇంటిముందు గట్టువారిపల్లె వాసులు అమ్మవారిని శాంతింపజేస్తూ పొట్టేళ్లు, మేకపోతులు, కోడి పుంజులను బలిచ్చారు. ఇదిలా ఉండగా బుధవారం సాయంత్రం నుంచి గురువారం తెల్లవారుజాము వరకు గుడిముందు ఆసాది కథను వినిపించారు. ఇదిలా ఉండగా చాలా ఏళ్ల తర్వాత గ్రామంలో గంగమ్మజాతర జరగడంతో ఊరంతా బంధుమిత్రులతో కళకళలాడింది.

మంత్రి దుర్గేష్‌కు జనసేన నేతల అభినందనలు

రాజంపేట, జూన్ 20: రాజంపేట రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కందుల దుర్గేష్‌కు రాజంపేట జనసేన నేతలు అభినందనలు తెలిపారు. ఆయనకు బొకే అందజేసి శాలువాలు కప్పి అభినందించారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రాజంపేట నియోజకవర్గ జనసేనపార్టీ నాయకుడు అతికారి కృష్ణ, జోగినేని మణి, టైల్స్ నరసింహ, గరికపాటి శివశంకర్, పసుపులేటి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, అతికారి కృష్ణ

ఘనంగా గంగమ్మ జాతర

రాజంపేట, జూన్ 20: మండల పరిధిలోని సిద్దులపల్లె గ్రామంలో గంగమ్మ జాతర ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున మహిళలు అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు రాజంపేట మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు.

యాళి వాహనంపై వేణుగోపాలుడు

పెనగలూరు, జూన్ 20: మండల కేంద్రమైన పెనగలూరులో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం యాళి వాహనంపై రుక్మిణి సత్యభామ సమేతుడైన వేణుగోపాలుడు పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అగ్రహారం వీధి నుంచి ప్రారంభమైన గ్రామోత్సవంలో భక్తులు శ్రీవారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. గ్రామంలోని పంచేటి వంశస్థుల ఆధ్వర్యంలో బుధవారం శ్రీవారి పూజా కార్యక్రమాలు జరిగాయి. రాత్రి ముఖ మండపంలో హరికథ గానం జరిగింది.

కొత్తపేటలో వాటర్ ప్లాంట్‌కు తాళాలు



కొత్తపేటలో అధికారులు తాళాలు వేసిన వాటర్ ప్లాంట్

పుల్లంపేట, జూన్ 20: మండల పరిధిలోని కొత్తపేటలో గురువారం వాటర్‌ప్లాంట్‌కు ట్రాన్స్‌కో అధికారులు, పంచాయతీ అధికారులు తాళాలు వేశారు. 'వైసీపీ నాయకుని నిర్వాకం, వాటర్ ప్లాంట్‌కు రూ.4 లక్షల బకాయి, నిద్రావస్థలో ట్రాన్స్‌కో అధికారులు' అనే శీర్షికను ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం వార్త వెలువడింది. ఇందుకు అధికారులు స్పందించారు. వెంటనే వైసీపీ నాయకులు నిర్వహిస్తున్న వాటర్‌ప్లాంట్ వద్దకు వెళ్లి ప్లాంటును స్వాధీనపర్చుకుని తాళాలు వేసి వెళ్లిపోయారు. దీంతో గ్రామంలో పలువురు చర్చించుకున్నారు.

పేద ప్రజల అభివృద్ధే టీడీపీ లక్ష్యం



ప్రజల సమస్యలు వింటున్న మేడా విజయశేఖర్‌రెడ్డి

నందలూరు, జూన్ 20: పేదల ప్రజల అభివృద్ధే టీడీపీ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పాటూరు పంచాయతీ టీడీపీ నాయకుడు తోట శ్రీను పిలుపు మేరకు గురువారం వారి గ్రామానికి వచ్చి కార్యకర్తలతో మాటామంతి నిర్వహించారు. అనంతరం పెద్దూరు శివరాంపురం, గౌరీశంకర్‌నగర్, ఎస్టీ కాలనీ నాయకులు తమ సమస్యలను మేడా విజయశేఖర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీను, బాబు, వెంకటసుబ్బయ్య, బాలయ్య, మన్యం, మురళి, చెన్నకేశవ, నాగరాజ, సాతపల్లె వెంకటేశ్, నందలూరు మండలం తెదేపా నాయకులు సయ్యద్ అమీర్, షేక్ మౌలాన, పఠాన్‌మెహర్‌ఖాన్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గంగమ్మ జాతర

చిట్వేలి, జూన్ 20: మండల పరిధిలోని తిమ్మాయపాళెంలో గురువారం గంగమ్మతల్లి జాతరను గ్రామస్థులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు తెల్లవారుజామున మేళతాళాల మధ్య పోతులరాజు, గంగమ్మతల్లి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో గంగమ్మతల్లికి బలిదానాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మండల పరిధిలోని గట్టుమీదపల్లె, మల్లెంపల్లెలో గంగమ్మతల్లి ముద్దలు పెట్టుకొని బోనాలు సమర్పించి బలిదానాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మీ గంగమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేశారు. జాతరలో పందారపు బండ్లు, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎస్ఐ సుధాకర్, సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి జాతరను ప్రశాంతంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో రాజుకుంట సర్పంచి గుత్తి నరసింహ, ఎంపీటీసీ ఎన్.నాగార్జున, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, అరవ సాని, వెంకటేశ్, మణి, మాదాసు నరసింహ, చెంగల్‌రాయుడు, కూటమి నేతలు, గ్రామస్థులు, కార్యనిర్వాహక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమాచార సేకరణ జరగాలి : ఎంఈఓ

గాలివీడు, జూన్ 20: పాఠశాలలో విద్యార్థులకు సంబంధించిన కచ్చితమైన సమాచార సేకరణతో పాఠశాల డేటాను నిర్వహించాలని ఎంఈఓలు పిల్లి నాగరాజు, శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో యూడైస్ ప్లస్ మీద మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాఠశాలకు సంబంధించిన వివరాలతో పాటు విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్ డేటాను ఆన్‌లైన్‌తో పొందుపరచాలని, తద్వారా పాఠశాలల పనితీరు, పర్యవేక్షణపై నియంత్రణ ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సేవలు అభినందనీయం

గాలివీడు, జూన్ 20: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న రెవెన్యూ ఉద్యోగుల సేవలు అభినందనీయమని తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1786లో జూన్ 20న రెవెన్యూ బోర్డును ఏర్పాటు చేసిన సందర్భంగా రెవెన్యూ దినోత్సవాన్ని జరుపుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం రెవెన్యూ రికార్డులు, అడంగల్, వన్‌బీ, ప్రభుత్వ దేవదాయశాఖ వక్ఫ్‌భూముల వివరాలు డిస్‌ప్లే చేయడంతో పాటు సంబంధించిన విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలాజి, మండల సర్వేయర్ తిమ్మారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.





తిరుమలకు మోకాళ్లపై వచ్చిన కలికిరి మహిళ


చివరిమెట్టు వద్ద పసుపు వేస్తున్న గౌరి

తిరుమల, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఓ మహిళ మోకాళ్లపై మెట్లెక్కి తిరుమలకు చేరుకుంది. పీలేరు నియోజకవర్గం కలికిరి మండలం, గుట్టపాళెంకు చెందిన గౌరి తన భర్త మల్లికార్జున గౌడ్‌తో కలిసి గురువారం శ్రీవారిమెట్టు మార్గంలో మోకాళ్లపై తిరుమలకు చేరుకుంది. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎం కావాలని, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందాలని తాను గతంలో మొక్కుకున్నట్టు తెలిపారు. తన కోరిక నెరవేరిన నేపథ్యంలో మొక్కు చెల్లించుకున్నానన్నారు.

ఎంపీడీవో కార్యాలయ నిధుల దుర్వినియోగంపై చర్చ


సునీల్

పుంగనూరు, జూన్ 20: పుంగనూరు ఎంపీడీవో కార్యాలయంలో జనరల్ ఫండ్స్ నుంచి రూ.1.36 కోట్లను కంప్యూటర్ ఆపరేటర్ సునీల్ తన ఖాతాకు మళ్లించడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై గురువారం ఆంధ్రజ్యోతిలో 'అమ్మో..కాంట్రాక్ట్ ఉద్యోగి!' అంటూ ప్రచురితమైన కథనం సంచలనం కలిగించింది. నిధుల గోల్‌మాల్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. నిధులు కాజేసిన పుంగనూరుకు చెందిన సునీల్ ఇప్పటికే విధులు వదిలేసి హైదరాబాద్, బెంగళూరుల్లో ఉన్నట్లు తెలిసింది. త్వరలోనే నిధుల రికవరికీ సునీల్‌పై అధికారులు పోలీసులకు ఫిర్యాదు ఇవ్వనున్నట్లు తెలిసింది. 2022-23లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి అప్పటి ఎంపీడీవో, ఏవో, సినియర్ అసిస్టెంట్‌కు షోకాజ్ ఇచ్చినట్లు ఎంపీడీవో మునిరెడ్డి తెలిపారు. వీరినుంచి రాగానే జడ్పీ సీఈవో గ్లోరియా చర్యలు తీసుకుంటారన్నారు.

తూకంలో తేడాలు
సివిల్ సప్లయిస్ గోడౌన్లలో తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 20 : జిల్లాలో అన్ని వ్యవస్థలతో పాటు సివిల్ సప్లయిస్ వ్యవస్థ సైతం గాడి తప్పింది.గత ఐదేళ్ళ కాలంలో పేద ప్రజలకు ఇచ్చే రేషన్ సరుకుల్లోనూ అవినీతి చోటు చేసుకుంది.పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల రాష్ట్రంలోని కొన్ని సివిల్ సప్లయిస్ గోడౌన్లను తనిఖీ చేసినప్పుడు పలు అక్రమాలు బయటపడ్డాయి. దీంతో అన్ని జిల్లాల్లో తనిఖీ చేసి నివేదికలు అందజేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.దీంతో జిల్లా అధికారులు నెల వారీగా లెక్కలు తీస్తున్నారు. జిల్లాలోని అంగన్‌వాడీలకు ఇక్కడినుంచే బియ్యం, కందిపప్పు, ఆయిల్ వంటివి సరపరా చేస్తున్నారు.పంచదార, కందిపప్పు సరఫరాలో కాంట్రాక్టర్లు తూకాల్లో మోసం చేస్తున్నారని అధికారులంటున్నారు. ఒక్కో రేషన్ షాపు పరిధిలో కనీసం 10 కార్డులకు రేషన్ పంపిణీ కావడం లేదని గుర్తించారు.ఎండీయూ వాహనాలు వచ్చినప్పుడు కార్డుదారులు బయటకు వెళ్లివుంటే కందిపప్పు, బియ్యం, చక్కెర మిగిలిపోతున్నాయి. వీటికి లెక్కలు చూపడం లేదు.పేదలకు ఇస్తున్న బియ్యం, చక్కెరల్లోనూ కిలోకు 100 గ్రాములు లెక్కన తక్కువ పంపిణీ చేస్తున్నట్లు బయటపడింది.ఈ విషయమై సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ సుమతిని అడగ్గా జిల్లా వ్యాప్తంగా వున్న 12 గోడౌన్లు, మండల స్టాకు పాయింట్లలో కందిపప్పు, బియ్యం, చక్కెర స్టాకును పరిశీలించామన్నారు.తూకాల్లో తేడా వున్న మాట వాస్తవమేనని చెప్పారు. ప్రధానంగా కిలో కందిపప్పుపై 20 గ్రాముల నుంచి 50 గ్రాముల వరకు తూకం తక్కువ వున్నట్లు పరిశీలనలో తేలిందన్నారు. అలాగే చక్కెర తూకంలోనూ కిలోపై 30 గ్రాముల వరకు తక్కువున్నట్లు బయటపడిందన్నారు. ఇకపై ప్రతి నెలా నిత్యావసర వస్తువులు తనిఖీ చేసి తూకాల్లో మోసం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీవారిమెట్టు మార్గంలో..
స్కాన్ టోకెన్లు ఉంటేనే దర్శనం: టీటీడీ


టికెట్ స్కానింగ్

తిరుమల, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి మెట్టు కాలినడక మార్గంలో 1,200వ మెట్టు వద్ద దివ్య దర్శనం టోకెన్ స్కానింగ్‌ను టీటీడీ తిరిగి ప్రారంభించింది. దీనికి సంబంధించి గురువారం ట్రయల్ రన్ నిర్వహించింది. దివ్యదర్శనం టోకెన్లు పొందిన భక్తులు శుక్రవారం నుంచి విధిగా 1,200వ మెట్టు వద్ద స్కానింగ్ చేయించుకోవాల్సి ఉంటుంది. లేకుంటే భక్తులకు దివ్యదర్శన క్యూలైన్‌లోకి అనుమతి ఉండదని టీటీడీ స్పష్టం చేసింది. గతంలో పులుల సంచారం ఉన్న నేపథ్యంలో ఈ టోకెన్లు ఉన్నా తప్పనిసరిగా నడచే రావాలనే నిబంధనలను టీటీడీ తాత్కాలికంగా రద్దు చేసింది . ఇకపై తప్పనిసరిగా టోకెన్లు పొందే భక్తులు మార్గం మధ్యలో స్కాన్ చేసుకుంటేనే దివ్యదర్శనం కేటగిరిలో దర్శనానికి అనుమతించాలని టీటీడీ నిర్ణయం తీసుకుంది.

కుప్పంలో చిన్నపిల్లల డాక్టర్ ఆత్మహత్యాయత్నం

కుప్పం, జూన్ 20: కుప్పంలో చిన్నపిల్లల వైద్యుడిగా పేరుపొందిన డాక్టర్ రూప్‌కుమార్ గురువారం ఆత్మహత్యకు యత్నించారు. ఈయన కుప్పంలోనే ఒక ప్రయివేట్ స్కూల్ కరస్పాండెంట్‌గా కూడా ఉన్నారు. అప్పుల పాలైన ఆయన.. ఆ అప్పులను తీర్చలేకనే ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది. బంధువులు ఆయన్ను పీఈఎస్ ఆస్పత్రిలో చేర్చారు. అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.18 కోట్లు

తిరుమల, జూన్20(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.18 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. బుధవారం 79,584 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,848 మంది తలనీలాలు సమర్పించారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం
● నలుగురి అరెస్ట్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 20: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని ఈస్ట్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రూ. 40 వేలు విలువ చేసే రెండు కిలోల గంజాయిని సీజ్ చేశారు. సీఐ మహేశ్వర రెడ్డి కథనం మేరకు.. రేణిగుంట పాంచాలినగర్‌కు చెందిన దీపేష్, ఎద్దుల చెరువుకు చెందిన మేకల అశోక్, మదనపల్లె బర్మావీధికి చెందిన మణికంఠ, ఎస్‌టీవీ నగర్‌కు చెందిన భూపతి వాసులు కొంతకాలంగా తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి నెలలో 10 రోజులు వివిధ ప్రాంతాలకు వెళ్లి విక్రయించేవారు. ముందస్తు సమాచారం మేరకు సీఐ నేతృత్వంలో ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, పురుషోత్తమ రెడ్డి, సిబ్బంది ఎస్‌టీవీనగర్‌లో గురువారం వీరిని అదుపులోకి తీసుకున్నారు. రూ. 40వేల విలువైన రెండు కిలోల గంజాయిని సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేశారు. రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వద్ద హాజరుపరచగా జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

జాతరలో ఫుడ్ పాయిజన్

పాలసముద్రంలో 150 మందికి అస్వస్థత ● బాధితుల కోసం మూడు ప్రత్యేక వైద్యశిబిరాలు


జాతరలో అంబలి తాగుతున్న గ్రామస్థులు (ఫైల్ ఫొటో)



పాలసముద్రం బీసీ కాలనీలోని వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులు - పీహెచ్‌సీలో బాధితులను పరామర్శిస్తున్న చిట్టిబాబు

పాలసముద్రం, జూన్ 20: పాలసముద్రం గంగ జాతరలో ఫుడ్ పాయిజన్ కావడంతో 150 మంది గ్రామస్థులు అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం నుంచి పలువురు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందారు. బాధితులకు జ్వరం, వాంతులు, విరేచనాలు కావడంతో గురువారం జిల్లా వైద్యాధికారులు పాలసముద్రం చేరుకొని పీహెచ్‌సీ ఆవరణలోను, ఆర్బీకేలో, బీసీ కాలనీలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి డీపీవో లక్ష్మి, ఏపీడీ డాక్టర్ శ్రీవాణి నేతృత్వంలో డాక్టర్ల బృందం బాధితులకు వైద్యం అందించారు. గంగ జాతర సందర్భంగా అమ్మవారికి సమర్పించిన అంబలిని ప్రసాదంగా స్వీకరించిన గ్రామస్థులందరికీ ఫుడ్‌పాయిజనింగ్ అయింది. గ్రామంలో పారిశుధ్య పనులు చేయించి తాగునీరు ఏమైనా కలుషితమైందా అనే ఉద్దేశ్యంతో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని తెప్పించారు. ఆ నీళ్లలో బ్లీచింగ్ పౌడర్ వేసి గ్రామంలో సరఫరా చేశారు. బాధితులను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు పరామర్శించారు. ఈ విషయాన్ని కలెక్టర్ షన్మోహన్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితులెవరికైనా సీరియస్ అయితే రెండు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. గురువారం సాయంత్రానికి కొంతవరకు బాధితులు కోలుకున్నారు. తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీవో రామనాథ రెడ్డి, డాక్టర్ మోహనకృష్ణ, ఈవోపీఆర్డీ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాగర్, పంచాయతీల కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు సేవలు అందించారు.

జోరువాన



చిత్తూరులో కురుస్తున్న వాన

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 20: జిల్లాలో బుధవారం ఉదయం 8 నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు పలు మండలాల్లో వర్షం కురిసింది. మూడు మండలాలు మినహా మిగిలిన 29 మండలాల్లో మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. అత్యధికంగా గంగవరంలో 61.4మి.మీ, అత్యల్పంగా పాలసముద్రంలో 2.2 మిమీ వర్షం కురిసింది. జూన్ సగటు వర్షపాతం 80.8 మి.మీ కాగా గురువారం నాటికి 179.1 మి.మీ నమోదైంది. పలమనేరులో 53.0, బంగారుపాళ్యం 47.0, పెనుమూరు 41.0, పులిచెర్ల 37.0, పెద్దపంజాణి 34.4, వి.కోట 33.2, గుడుపల్లి 32.4, కుప్పం 30.2, గుడిపాల 27.8, సదుం 27.4, యాదమరి 25.2, రొంపిచెర్ల 23.4, తవణంపల్లె 22.4, చిత్తూరు అర్బన్ 19.6, చిత్తూరు రూరల్ 18.6, బైరెడ్డిపల్లి 16.8, రామకుప్పం 14.8, గంగాధరనెల్లూరు 14.2, సోమల 12.4, శాంతిపురం 12.2, పుంగనూరు 11.6, పూతలపట్టు 10.4, చౌడేపల్లి 9.8, ఐరాల 6.2, శ్రీరంగరాజపురం 6.0, నగరి 5.8, వెదురుకుప్పం 3.6 మి.మీ నమోదైంది. పలు చెక్‌డ్యామ్‌లు నిండాయి. పట్టణాల్లో రోడ్లు జలమయమయ్యాయి. వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

వర్షాకాల సన్నద్ధతపై టీటీడీ ఈవో సమీక్ష


నారాయణగిరి ప్రాంతంలోని క్యూలైన్లో భక్తులకు అందజేస్తున్న కిచిడీని పరిశీలిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్20 (ఆంధ్రజ్యోతి): వర్షాకాల సన్నద్ధతపై టీటీడీ ఈవో శ్యామలరావు గురువారం గోకులం విశ్రాంతి భవనంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు.వివిధ సందర్భాల్లో భారీ వర్షాలకు బండరాళ్లు కూలి దెబ్బతిన్న రెండో ఘాట్‌రోడ్డును ఎలా పునరుద్ధరించారో అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కల్యాణి డ్యాంతో పాటు తిరుమలలో భక్తులకు ప్రధాన నీటి వనరులైన ఐదు డ్యాముల గురించి కూడా వివరించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ రూపొందించాలని ఈవో ఆదేశించారు. కొనుగోళ్ల, గిడ్డంగుల శాఖలపై సమీక్షించారు. జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, ఈఈలు సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీహరి, ఎలక్ట్రికల్ డీఈ రవిశంకర్‌రెడ్డి, కొనుగోళ్ల జీఎం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.కాగా ఈవో గురువారం నారాయణగిరి షెడ్ల వద్ద వివిధ క్యూలైన్లను పరిశీలించారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌కు వెళ్లే సర్వదర్శన, స్లాటెడ్ సర్వదర్శన, ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూలైన్లను తనిఖీ చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఈవోకు పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపించింది. క్యూలైన్లలోనే వ్యర్థాలు కనిపించడంతో ఆయన సీరియస్ అయ్యారు.సంబంధిత అధికారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు.

అభివృద్ధిపై ప్రజల ఆశలెన్నో!

● నేడు అసెంబ్లీలో కొత్త ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

చిత్తూరు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన ఏడుగురు ఎమ్మెల్యేలు శుక్రవారం శాసనసభలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అనంతరం తమతమ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిపాదించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును పర్యవేక్షించే, సమీక్షించే అధికారాలను, ప్రొటోకాల్ తదితర సదుపాయాలన్నింటినీ సంతరించుకోనున్నారు. కుప్పం నుంచి సీఎం చంద్రబాబు, పలమనేరు నుంచి అమరనాథరెడ్డి, చిత్తూరు నుంచీ గురజాల జగన్మోహన్, పూతలపట్టు నుంచి మురళీమోహన్, జీడీనెల్లూరు నుంచి థామస్, నగరి నుంచి గాలి భానుప్రకాష్‌రెడ్డి, పుంగనూరు నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేలుగా గెలిచిన సంగతి తెలిసిందే. శుక్రవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ తొలి సమావేశాలకు హాజరై ప్రమాణ స్వీకారం చేయడం కోసం వీరంతా రాజధానికి పయనమయ్యారు. చాలామంది సభ్యుల వెంట కుటుంబసభ్యులు, సన్నిహిత బంధుమిత్రులు, ముఖ్యనేతలు, అనుచరులు తరలి వెళ్లారు. ఎమ్మెల్యేల నుంచీ జిల్లా ప్రజలు ఎంతో ఆశిస్తున్నారు. అలాగే, నూతన ఎమ్మెల్యేలు చట్టసభలో సమస్యలను ప్రస్తావిస్తారని, వాటి పరిష్కారాలకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారని, మైలురాళ్ళుగా నిలిచిపోయే అభివృద్ధి పనులను సాధిస్తారని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

ఎర్రచందనం స్వాధీనం ఇద్దరు తమిళ స్మగ్లర్ల అరెస్టు


పట్టుబడ్డ స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్సు సిబ్బంది

మంగళం, జూన్ 20: అన్నమయ్య జిల్లా రాయవరం అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు గురువారం ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. కారుతో సహా 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐలు లింగాధర్, విశ్వనాథ్ బుధవారం రాయచోటి మీదుగా కూంబింగ్ నిర్వహించారు. సుండుపల్లి అటవీబీట్ పరిధిలోని గంగోత్రి రాస్తా వద్ద అర్ధరాత్రి సమయంలో తనిఖీలు చేపట్టగా సుండుపల్లి సానిపాయ జంక్షన్ నుంచి ముగ్గురు మోటారు సైకిల్‌పై రావడాన్ని గుర్తించారు. టాస్క్‌ఫోర్సు పోలీసులను చూసి వారు పారిపోతుండగా సిబ్బంది వెంబడించి ఇద్దరిని పట్టుకున్నారు. ఒకరు పారిపోయారు. కొందరు టాస్క్‌ఫోర్సు సిబ్బందిని చూసి కారును వదలి వెళ్లిపోయారు. కారులో 13 ఎర్రచందనం దుంగలున్నట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు నిర్ధారించారు. పట్టుబడ్డవారు తమిళనాడు వేలూరు జిల్లా కేవీకుప్పంకు చెందిన శరత్‌కుమార్ రవి(23), దేవరాజ్ గోవిందస్వామి(27)గా గుర్తించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నంలో కిందపడిన ఓ స్మగ్లర్‌కు తలకు గాయమైనట్లు వారు తెలిపారు. వీరితోపాటు 12మంది స్మగ్లర్లు పారిపోయినట్లు విచారణలో తేలిందన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కూంబింగ్‌లో అటవీశాఖ, టాస్క్‌ఫోర్సు సిబ్బంది పాల్గొన్నారు.




తెప్పపై పద్మావతి దేవి అభయం

● నేటితో ముగియనున్న తెప్పోత్సవాలు


గజవాహనంపై అమ్మవారి ఊరేగింపు

తిరుచానూరు, జూన్ 20: తెప్పోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి తిరుచానూరులోని పద్మావతి అమ్మవారు తెప్పపై విహరించి భక్తులను కటాక్షించారు. మధ్యాహ్నం పద్మసరోవరంలోని నీరాడ మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తికి అభిషేకం నిర్వహించారు. సర్వాలంకార శోభితురాలైన అలమేలు మంగమ్మ తెప్పపై కొలువుదీరి ఐదు పర్యాయాలు విహరించి భక్తులను అనుగ్రహించారు. రాత్రి లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారికి మాడ వీధుల్లో గజవాహన సేవ జరిగింది. శుక్రవారం గరుడవాహన సేవతో ఐదు రోజులుగా జరుగుతున్న తెప్పోత్సవాలు ముగియనున్నాయి.

రేషన్ డీలర్లకు కమీషన్ విడుదల

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 20: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని రేషన్ షాపు డీలర్లకు జూన్ నెలకు సంబంధించి కమీషన్ గురువారం విడుదల చేస్తూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు జిల్లాలోని 1,379 మందికి రూ.89,42,509, తిరుపతి జిల్లాలోని 1,457 మందికి రూ.85,09,442 కమీషన్ వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఈ నెలకు సంబంధించి నిత్యావసర వస్తువుల పంపిణీ ప్రక్రియ ఈనెల 18వ తేదీతో ముగిసింది.

పంటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు


కొబ్బరిచెట్టును ఏనుగులు కూకటివేళ్లతో పెకలించిన దృశ్యం

కల్లూరు, జూన్ 20: పులిచెర్ల మండలంలోని పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. సుమారు నెల రోజులుగా మండలంలో తిష్ట వేసిన ఏనుగులు మామిడి, టమోటా, అరటి, కొబ్బరి తదితర పంటలకు తీవ్రనష్టం కలిగిస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పాళెం పంచాయతీ కోటపల్లి సమీపంలో బుధవారం రాత్రి సుమారు 10 ఏనుగుల గుంపు పలువురి రైతుల పంటలను ధ్వంసం చేశాయి. కోటపల్లికి చెందిన రైతు నాథముని నాయుడు మామిడితోటలోని కొబ్బరి చెట్టును కూకటివేళ్లతో పెకలించాయి. కల్లూరుకి చెందిన రైతులు సయ్యద్‌బాషా, ఖాదర్‌వల్లి వరినారును తొక్కేశాయి. రైతు యుగంధర్ మామిడిచెట్లను విరిచేశాయి. మామిడి కాయలను నేలరాల్చాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆ రైతులు కోరారు.

రూ. 2లక్షల విలువైన సిగరెట్ల చోరీ



దుకాణం షట్టర్‌కు వేసిన తాళం పగలగొట్టివున్న దృశ్యం - దుకాణంలో చిందరవందరగా పడివున్న సరుకులు

బైరెడ్డిపల్లె, జూన్ 20 : బైరెడ్డిపల్లెలో బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు రెండు కిరాణా దుకాణాల్లో చోరీ చేశారు. రూ.2లక్షలకు పైగా విలువైన సిగరెట్లను దోచుకెళ్లారు. బాధితుల కథనం మేరకు.. బైరెడ్డిపల్లె మెయిన్‌రోడ్డులో వినయ్‌కుమార్ దుకాణానికి వేసివున్న షట్టర్ తాళాలు పగలగొట్టి దాదాపు రూ.1లక్షా 30వేల విలువచేసే సిగరెట్ బండిళ్లు, డ్రాలో ఉంచిన రూ.15వేల నగదు కాజేశారు. అలాగే నాలుగురోడ్ల కూడలి సమీపంలో కడపనత్తం రహదారిలో కృష్ణమూర్తికి చెందిన దుకాణం షట్టర్ తాళాలు పగలగొట్టి రూ.99,850 విలువైన సిగరెట్ బండిళ్లను చోరీ చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధిత వర్గాలకు ప్రభుత్వం అండగా ఉండాలని కోరుకున్నా
మంత్రి కొల్లు రవీంద్ర



తిరుమల, జూన్20 (ఆంధ్రజ్యోతి): నష్టపోయిన అన్ని వర్గాలకు ఈ ప్రభుత్వం అండగా ఉండాలని స్వామిని కోరుకున్నట్టు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీకి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని, పవన్ కల్యాణ్, మోదీ సహకారంతో చక్కటి ప్రభుత్వం ఏర్పాటు కావాలని తాను ఓ యాగం చేసినట్టు తెలిపారు. యాగం సంపూర్ణంగా ముగిసిన నేపథ్యంలో శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టాలని, అన్ని విధాల ముందుకు తీసుకెళ్లాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, KALPANA LEPAKSHI, W/o Mallapuram Babu, resident of D.No.7-191/1,Babu residency, Madanapalli Road,Opp.Substation,Vinayaka Nagar, kalikiri-517234, Annamayya Dist., A.P. Henceforth be known as KALPANA LEPAKSHI (New Name) instead of MALLAPURAM KALPANA (Old Name)
AJT-4024

CHANGE OF NAME
I,PREM CHOWDARY (Old Name) R/o:22-11-22/A,2nd floor ,Poolavanigunta, Renigunta Road, Tirupati Dt,A.P. Do here by declared I have changed my Surname as PREM CHOUDHARY (New Name) W/o Dayaram Choudhary
AJT - 4026

PLOTS FOR SALE
తిరుపతి చుట్టు ప్రక్కన అప్రూవల్ ప్లాట్స్ 6.50లక్షలు, 8లక్షలు, 10లక్షలు, 12, 15, 20లక్షలు, 30లక్షలు. Investment & గృహ నిర్మాణానికి అనువైన ప్లాట్స్ అమ్మబడును. సంప్ర. సెల్: 99660 66111
AJT- 4023

WANTED TEACHERS
Wanted teachers for higher class Social, Hindi, Computers, Wardens, PET, S.N Puram, Tirupati. Contact : 92908 98331, 70138 81383.
AJT - 4004

WANTED
Accounts Manager (Tally), Sales Manager, Sri Gopi Krishna Oil Traders, Beri Street, Tirupati. Cont. : 93939 22999, 97049 56789
AJT - 187362

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంధ్రు 7382114647
AJA- 189263

CHANGE OF NAME
I, DAYARAM CHOWDARY (Old Name) R/o: 22-11-22/A, Poolavanigunta,Tirupati Urban,Tirupati Dt, A.P. Do here by declared I have changed my Surname as DAYARAM CHOUDHARY (New Name) S/o T ejaram Choudhary
AJT - 4025

CHANGE OF NAME
I, KOPPARTHI JAYAPRADA (Old Name) R/o: 5-200 ,Panagaluru,Annamayya Dt, A.P. Do here by declared I have changed my name as PANCHETI JAYASANDHYA (New Name) W/o Pancheti Pratapap Reddy .
AJT - 4027

PLOT FOR SALE
వడమాలపేట టోల్ ప్లాజా దగ్గరలో రూ.12,50,000లకే ప్లాట్ మరియు తిరుపతి దగ్గర అప్రూవల్ ప్లాట్ అంకణం 40000లకు అమ్మబడను. సెల్ : 97001 19024
AJT - 4008

PLOTS FOR SALE
నేషనల్ హైవే కి అనుకొని ఏర్పేడు, వెంకటగిరి, IISEER ప్రక్కన అన్ని సదుపాయాలతో ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు అతితక్కువ ధరకే. డైరెక్ట్ ఓనర్. 95027 74175 / 79959 92114.
AJT - 4010

PLOTS FOR SALE
తిరుపతి 3K.Mలో Taj Star హోటల్, PLR Gardens దాటగానే సుబ్రహ్మణ్య స్వామి టెంపుల్, విల్లాలు ఇండిపెండెంట్ ఇల్లు, అపార్ట్‌మెంట్లు ఇల్లు, అపార్ట్‌మెంట్లు రాకముందే తిరుపతి Smart cityలో అంతర్భాగంగా అభివృద్ధి చెందుతున్న తనపల్లిలో 40 feets రోడ్డుకు ఆనుకుని వెంటనే ఇల్లు కట్టుకునే 100% వాస్తు Plots అమ్మబడును. కావలసినవారు వెంటనే సంప్రదించండి. 7386143336
AJT - 4011

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

వాహనం ఢీ కొని కూలిన విద్యుత్ స్తంభం

తంబళ్లపల్లె, జూన్ 20: తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలోని మదనపల్లె రోడ్డులో తంబళ్లపల్లె టౌన్ ఫీడర్ 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో విద్యుత్ స్తంభం కిందకు ఒరిగింది. దీంతో విద్యుత్ తీగలు నేలను తాకడంతో సరఫరా ట్రిప్ అయింది. వెంటనే అప్రమత్తమైన విద్యుత్ సిబ్బంది లైన్‌ను పరిశీలించగా మదనపల్లె రోడ్డులో ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభం వాహనం ఢీకొనడంతో విరిగి పోయినట్లు గుర్తించినట్లు తెలిపారు. కాగా స్తంభం విరిగి రోడ్డుపై కాకుండా అటువైపుగా పడటంతో ఎటువంటి ప్రమాదం జరుగలేదన్నారు. విషయం తెలిసిన వెంటనే ట్రాన్స్‌కో లైన్‌ఇన్‌స్పెక్టర్ భాస్కర్, లైన్‌మెన్ షబ్బీర్, సహాయకులు యుద్ధప్రాతిపదికన కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు తెలిపారు. అయితే కరెంటు స్తంభాన్ని ఢీ కొన్న వాహనం ఏదో తెలియరాలేదని తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్ 20:ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వల్లిబసు తెలిపారు. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ, బయ్యారెడ్డి కాలనీకి చెందిన కె.రెడ్డెప్ప(45) ఇంటి వద్దనుంచి ద్విచక్రవాహనంపై మదనపల్లె పట్టణంలోకి బయలుదేరి వస్తుండగా కురబలకోట మండలం, అంగళ్లు పంచాయతీ, సర్కారుతోపుకు చెందిన యువకుడు ద్విచక్రవాహనంపై మదనపల్లె నుంచి ఇంటికి బయలుదేరి వెళుతున్న సమయంలో రెడ్డెప్ప స్కూటర్‌ను ఢీ కొన్నారు. దీంతో రెడ్డప్పకు కుడికాలు విరిగి కంటివద్ద గాయమై చెవిలో రక్తస్రావం అయింది. వెంటనే రెడ్డెప్పను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించగా డాక్టర్లు పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. బాధితుని అన్న సూర్యనారా యణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సిద్దవరంలో కేబుల్ చోరీ

పెద్దమండ్యం, జూన్ 20: సిద్దవరం గ్రామపంచాయతీ మల్లయ్యగారిపల్లిలో కొత్త వ్యవసాయబోరుకు ఏర్పాటు చేసిన 120 మీటర్ల కేబుల్ వైర్ బుధవారం రాత్రి గుర్తు దుండగులు చోరీకి పాల్పబడ్డారని టీడీపీ మహిళా రైతు నానాబాల శాంతమ్మ తెలిపారు. ఆమేరకు గురువారం పెద్దమండ్యం ఎస్ఐ చలపతికు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ప్రజాసేవే రెవెన్యూ శాఖ ధ్యేయం



రెవెన్యూ రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్



పెద్దమండ్యంలో రెవెన్యూ దినోత్సవం జరుపుకుంటున్న తహసీల్దార్ లక్ష్మీనాయక్, సిబ్బంది



వాల్మీకిపురం రెవెన్యూ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్ ఖతిజున్‌ఖుబ్రా

మదనపల్లె టౌన్, జూన్ 20:ప్రజలకు సేవ చేయడమే రెవెన్యూ శాఖ ధ్యేయమని మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్ పేర్కొన్నారు. మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఆర్డీవో ఆధ్వర్యంలో గురువారం ఘనంగా రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో రిటైర్డ్ అయిన ఇద్దరు రెవెన్యూ ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రెవెన్యూ దినోత్సవం జరుపుకోవడం ఆనందంగా వుందని, ప్రజాసేవలో వుండే రెవెన్యూ ఉద్యోగులు ఈ రోజును గుర్తుంచుకోవాలని సూచించారు. అనంతరం రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు మునిప్రసాద్, సత్యకుమార్‌లను శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టరేట్ డీఏవో శ్రీనివాసులు, సబ్‌కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ములకలచెరువులో: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనీల్‌కుమార్, ఆర్ఐ అంజనేయులు తదితరులు ఉత్తమ సేవలు అందించిన మాజీ వీఆర్‌వోలు, అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎ్ఫఐ నజీర్‌అహమ్మద్, ఆర్ఎస్ డీటీ లక్ష్మీ, సీనియర్ అసిస్టెంట్ చంద్ర, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: రెవెన్యూశాఖ విలువలు కాపాడాలని పెద్దమండ్యం తహసీల్దార్ లక్ష్మీనాయక్ పిలుపునిచ్చారు. పెద్దమండ్యం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవం జరిగింది. రెవెన్యూ శాఖలో విశిష్ట సేవలందించిన సీనియర్ రెవెన్యూ సిబ్బంది, పదవీ విరమణ చెందిన సిబ్బందికి పూలమాలలు వేసి దశ్శాలువలతో సన్మానిచ్చారు. డీటీలు గౌరిశంకర్, ఆర్ఐ రమేష్, వీఆర్‌వోలు శ్రీనివాసులునాయుడు, నీలిమా, జయచంద్ర, నవాజ్, ఫక్రుద్దీన్, జూనియర్ అసిస్టెంట్ హర్షవర్ధనరెడ్డి, వీఆర్ఏలు బుడాన్‌బాష, రామాంజులమ్మ, రాణీ, రామారావు, లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో:గుర్రంకొండ తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనాథ్ మాట్లాడుతూ సిబ్బంది విధులపట్ల అంకితాభావంతో పని చేయాలని సూచించారు. ప్రతి ఉద్యోగి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ ఖతిజున్‌ఖుబ్రా మాట్లాడుతూ విధుల విషయంలో అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు సేవలందించినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం రిటైర్డు ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, సర్వేయర్ శ్రీనివాసులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుణ్యవతి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఉద్యోగ విరమణ చేసిన వీఆర్‌ఓలు నరసింహారావు, వెంకటరెడ్డిలను దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: ప్రజలకు ప్రత్యక్షంగా సేవలు అందించడంలో రెవెన్యూ శాఖ కీలకమైనదని తహసీల్దారు బ్రహ్మయ్య అన్నారు. గురువారం తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ జనన, మరణ ధృవీకరణపత్రాలు, కుల, ఆదాయ, రైతులకు సంబంధించిన పలు రకాల ధృవీకరణ పత్రాలు తదితర సేవలను రెవెన్యూ శాఖ ద్వారానే పొందాల్సి ఉంటుందన్నారు. అనంతరం రిటైర్డ్ వీఆర్వో గంగులప్ప, సీనియర్ వీఆర్ఏ ప్రసాద్‌లను దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు వీఆర్ఏలు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు

- చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఐదు సంతకాలు
- తిరుమలకు పాదయాత్ర ప్రారంభోత్సవంలో టీడీపీ నేత జయచంద్రారెడ్డి



పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూన్ 20: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో కురబలకోట మండలం మట్లివారిపల్లె పంచాయతీ ఎర్రమద్దివారిపల్లె నుంచి టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాధరెడ్డిలో పాటు 50 మంది టీడీపీ శ్రేణులు తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్రను టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా బాధ్యతలు చేపట్టిన తొలి రోజే మెగా డీఎస్సీ ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దు, పింఛను రూ.4వేలకు పెంపు, నైపుణ్య గణన, అన్న క్యాంటీన్లు పునరుద్ధరణలపై సంతకాలు చేశారన్నారు. చంద్రబాబునాయుడు సహాయ సహకారాలతో ఇచ్చిన మాట ప్రకారం తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత మంత్రి గిరిధర్ రెడ్డి, ములకలచెరువు మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నేతలు వైజీ రమణ, డీఆర్ వెంకటరమణరెడ్డి, మోహన్‌రెడ్డి, రాజారెడ్డి, సిద్ధారెడ్డి, సురేంద్ర, తులసీధర్‌నాయుడు, భూమిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఫిర్యాదులను15 రోజుల్లో పరిష్కరించాలి

- ప్రత్యేక విద్యుత్ అదాలత్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి



వినియోగదారుల ఫిర్యాదులను పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాస

మదనపల్లె టౌన్, జూన్ 20:ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో వినియోగదారుడి నుంచి వచ్చిన ఫిర్యాదులను 15రోజుల్లో గా పరిష్కరించాలని ప్రత్యేక విద్యుత్ అదాలత్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద ఈఈ యుగంధర్ ఆధ్వర్యంలో నలుగురు సభ్యులతో కూడిన బృందం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదాలత్ చైర్మన్ మాట్లాడుతూ విద్యుత్ సరఫరా, వినియోగం, వ్యవసాయ, పరిశ్రమల ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ లైన్లు షిఫ్టింగ్, విద్యుత్ బిల్లుల చెల్లింపు, ఇతర అంశాలపై వినియోగదారులు ఇచ్చే ఫిర్యాదుల ను ఆయా విభాగాలకు పంపుతామన్నారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు పరిష్కారం చేయడంతో పాటు, ఒక వేళ పరిష్కరించే వీలులేకుంటే 15రోజుల్లో వినియోగదారుడికి సమాధానం రాయాలన్నారు. మొత్తం 16 మంది వివిధ అంశాలపై విద్యుత్ అదాలత్ చైర్మన్‌కు ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ ఆర్థిక సభ్యు డు కె.రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు ఎస్.ఎల్.అంజనికుమార్, స్వతంత్ర్య సభ్యు రాలు జి.ఈశ్వరమ్మతో పాటు ఎస్పీడీసీఎల్ ఏడీఈలు సురేంద్రనాయక్, జీవన్‌కుమార్, రుక్మాంగదబాబు, కార్యాలయ ఏవో కిరణ్‌కుమార్, ఏఈలు రెడ్డికుమార్, నరసింహారెడ్డి, గోవిందరెడ్డి, రమేశ్, ఎస్పీడీసీఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యం



పీటీఎం ఎంపీడీవోకు వినతి పత్రాన్ని ఇస్తున్న జనసేన నాయకులు

పెద్దతిప్పసముద్రం జూన్ 20 : అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ పేర్కొన్నారు. గురువారం ఆయన కూటమి నాయకులతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి బ్రహ్మానందరెడ్డిని కలిసి మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు వాటి వివరాలు, ఉపాధి హామీలో పని చేస్తున్న పలువురు సిబ్బంది వివరాలు, తమకు కావాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఆయా గ్రామాల్లో పలు పనులను చేపట్టిన గుత్తేదారుల విరాలను సమర్పించాలని కోరుతూ ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జనసేన మండల అధ్యక్షుడు శంకరతో పాటు కూటమి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో : పెద్దమండ్యం మండలంలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలు ఇవ్వాలని తంబళ్లపల్లి జనసేన పార్టీ ఇన్‌చార్జ్ సాయినాథ్ గురువారం ఎంపీడీవో వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా సాయినాథ్ మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు, ఉపాధి హామీ పనుల వివరాలు, ఫీల్డ్ అసిస్టెంట్ వివరాలు ఇవ్వాలని కోరారు. మండల జనసేన పార్టీ అధ్యక్షుడు శంకర నాయకులు అస్రఫ్, నాగూరువలి, ప్రభాకరరెడ్డి,. ధన, పెద్దిరెడ్డప్ప, భీమయ్య,, ప్రభాకర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించండి

తంబళ్లపల్లెలో: ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని తంబళ్లపల్లె జనసేన ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్ కోరారు. గురువారం టీడీపీ, జనసేన, బీజేపి నాయకులతో కలిసి ఈవోపీఆర్డీ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం తంబళ్లపల్లెలో పునర్నిర్మిస్తున్న ఎన్టీఆర్ ఘాట్ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, తెలుగు యువత మండలాధ్యక్షుడు గంగరాజు, రాజంపేట బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, మ్యూజికల్ శివ, కాలా నారాయణ, వీరాంజినేయులు, జయరాంరెడ్డి, మధు, అశోక్, జనసేన నాయకులు మురళి, రాజారెడ్డి, సురేష్, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పింఛన్ పెంచినందుకు సీఎంకు కృతజ్ఞతలు



సంబరాలు చేసుకుంటున్న దివ్యాంగులు, ఆసంఘం నేతలు ఎస్.మౌలాలి తదితరులు

మదనపల్లె, జూన్ 20: పింఛన్ పెంపుతోపాటు అమలుకు మొదటి సంతకం చేయడాన్ని హర్షిస్తూ దివ్యాంగుల సంఘం నేతలు సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని చెవి టీ, మూగసంఘం కార్యాలయంలో గురువారం దివ్యాంగులపోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మౌలాలి ఆధ్వర్యంలో జరి గిన ఈ కార్యక్రమానికి ఎంఎస్పీ జాతీయ నాయకుడు ఎస్.నరేంద్రబాబు, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రవిలు హాజరై మాట్లాడారు. దివ్యాంగుల పింఛన్ రూ.3వేల నుంచి ఏకంగా రూ.6వేలకు పెంచడాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా సీఎంతోపాటు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఇందుకోసం పోరాడిన మందకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషాకు కృతజ్ఞతలు తెలపడంతోపాటు ఆ నలుగురి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, స్వీట్లు పంచిపెట్టారు.

సీఎంను కలసిన బీజేపీనేత గుత్తా హరికృష్ణ



సీఎం చంద్రబాబుతో బీజేపీ నేత గుత్తా హరికృష్ణ

మదనపల్లె, జూన్ 20: మదనపల్లెకు చెందిన బీజేపీ సీనియర్ నేత గుత్తా హరి కృష్ణ(బీజేపీ హరి) సీఎం నారా చంద్రబా బునాయుడును కలసి శుభాకాంక్షలు తెలి పారు. అమరావతిలోని సచివాలయంలో సీఎంను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఈ సందర్భంగా మదనపల్లె తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఉద్దేశించిన చిప్పిలి, గుట్టకిందపల్లె సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుల మొరవలు పూర్తి చేసేలా ఆదేశించాలని గుత్తా హరికృష్ణ, సీఎంను కోరారు. అలాగే పట్టణంలోని నాలుగువైపులా హిందూ శ్మశాన వాటిక, పట్టణం చుట్టూ మాస్టర్‌ప్లాన్ బైపాస్ రోడ్డు నిర్మాణం, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని హరికృష్ణ, సీఎంను కోరారు.

నీటి వినియోగంపై అవగాహన పెంచుకోవాలి

మదనపల్లె టౌన్, జూన్ 20: గ్రామాల్లో ప్రజలు నీటి వినియోగంపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో భానుప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నీటిని వృథా చేయకూడదని, అవసరానికి మించి నీరు వాడితే భవిష్యత్‌లో కలిగే ఇబ్బందులు గురించి వివరించారు. గ్రామాల్లో ఒక్కో మనిషికి ఎంత నీరు వినియోగించాలో వివరించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఎంఈవో, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై ప్రత్యేక దృష్టి సారించండి



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ మద్దులేటి

పెద్దతిప్పసముద్రం జూన్ 20 : మండలంలోని రైతులందరు ఉద్యాన పంటలపై దృష్టి సారించాలని ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ మద్దులేటి సూచించారు. గురువా రం పీటీఎం మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీడీ మధుబాబు, ఏపీవో తిరుమలప్పతో కలసి పరిశీలించారు. ముందుగా వారు మండలంలోని రాపూరివాండ్లపల్లె గ్రామంలోని రంగసముద్రం చెరువులో జరుగుతున్న ఉపాధి పనులులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉపాధి హామీ పనుల్లో భాగంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఉపాధి పనులను ఉద్యా న పంటలకు వర్తింప చేస్తామని రాష్ట్రంలోని ఉపాధి హామీ కూలీలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఓ మంచి బహుమతి ప్రసాదించినట్లు తెలిపారు. ప్రతి రైతు ఉద్యాన పంటలు పాగు చేసేలా అవగాహన కల్పించాలని వారు కోరారు. వారి వెంట ఏపీవో తిరుమలప్ప టెక్నికల్ అసిస్టెంట్లు, పీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

టీడీపీ నేతలను కొట్టిన ఎస్ఐని సస్పెండ్ చేయాలి

నిమ్మనపల్లి, జూన్ 20: టీడీపీ నేతలను అకారణంగా కొట్టిన ఎస్ఐ లోకేష్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని రాజంపేట అధికార ప్రతినిధి ఆర్వే వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఒక కారు విషయమై స్టేషన్‌కు వెళ్లిన ఇద్దరు డీటీపీ కార్యకర్తలు శంకర, రామకృష్ణలపై ఎస్ఐ లోకేష్‌రెడ్డి అతి దారుణంగా చితకబాదినట్లు తెలిపాడు. కాగా ఎస్ఐ లోకేష్‌రెడ్డి పలు భూతగాలలో తల దూర్చి వైసీపీ నాయకులకు వత్తాసు పలుకుతున్నాడని ఆరోపించారు. అసలు పిర్యాదు దారులను కొట్టే పని ఏముందని దీనిపై జిల్లా పోలీస్ అధికారికి, మదనపల్లి శాసన సభ్యుడు షాజహాన్ బాషాకు, హోంశాఖ మంత్రి అనితకు పిర్యాదు చేశామని తెలిపారు.

25న ఎస్ఈబీ సీజ్డ్ వాహనాల వేలం

మదనపల్లె టౌన్, జూన్ 20: మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో నాటుసారా, కర్ణాటక మద్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డ వాహనాలను ఈనెల 25వ తేదిన బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి తెలిపారు. వాహనాలు వేలంలో పాల్గొనదలిచే వారు ఈనెల 24వ తేదీ లోపు రూ.5వేలు దరఖాస్తు రుసుం చెల్లించి టోకెన్లు తీసుకోవాలన్నారు. స్థానిక ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో మంగళవారం ఉదయం 10గంటలకు నిర్వహించే వేలంలో వాహనాలు పాడుకున్న వారు ధరతో పాటు 18శాతం జీఎస్టీ చెల్లించి, వాహనాలు తీసుకెళ్లాలన్నారు. పూర్తి వివరాలకు 22వ తేది నుంచి ఎస్ఈబీ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

దోమల నివారణ అందరి బాధ్యత

కలకడ, జూన్ 20:వివిధ వ్యాధులకు కారణమైన దోమలను నివారించవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఆయన పాపిరెడ్డిగారిపల్లె గ్రామస్థులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అదే విధంగా డ్రైడే ఫ్రైడేను విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ముజీబ్‌బాష, జయరామయ్య, సుబ్బరత్నమ్మ, జమీల్, షరీఫ్‌లు పాల్గొన్నారు.

పీలేరు గ్రామ పంచాయతీలో 'సెలవు' కలకలం!

- తనను ఇరికించే యత్నం జరుగుతోందంటూ సర్పంచ్ ఫిర్యాదు
- ఫోనులో ఈవోను తీవ్రంగా దుర్భాషలాడిన వైనం
- సెలవులో వెళ్లిపోయిన ఈవో

పీలేరు, జూన్ 20: పీలేరు గ్రామ పంచాయతీలో సర్పంచు సెలవు లేఖ చిచ్చు రేపింది. ఇన్‌ఛార్జ్ సర్పంచ్ పదవీ కాలం పొడిగింపు కోసం చేసిన ప్రయత్నం ఇందుకు కారణమైంది. ఇన్‌చార్జ్ సర్పంచ్, ఇన్‌చార్జ్ ఈవోలు తన మానసిక స్థితి సరిగ్గా లేదంటూ తప్పుడు సర్టిఫికేటుతో సెలవు పొడిగించుకోవడమే కాకుండా తాను నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు రికార్డులు తారుమారు చేసే ప్రయత్నం చేస్తున్నారని సెలవులో ఉన్న పీలేరు సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా గురువారం డీపీవోకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆయన అంతటితో ఆగకుండా ఇన్‌ఛార్జ్ ఈవోపై తిట్ల దండకం అందుకో వడంతోపాటు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఈవోను ఫోనులో హెచ్చరించారు. దీంతో మనస్తాపానికి గురైన ఈవో ప్రస్తుతానికి ఐదు రోజులు సెలవు పెట్టగా అటు నుంచి అటే దీర్ఘకాలిక సెలవులో వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారాలన్నీ ప్రస్తుతం పీలేరులో చర్చనీయాంశం అయ్యాయి.

రెండున్నరేళ్లకు కుదిరిన ఒప్పందం

2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పీలేరు గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. అప్పట్లో పీలేరు సర్పంచు పదవి కోసం స్థానిక వైసీపీ నాయకులైన డాక్టర్ హబీబ్ బాషా, చిత్తూరు జిల్లా జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడైన షామియాన షఫీ తీవ్రంగా పోటీ పడ్డారు. ఇద్దరినీ సంతృప్తి పరిచేందుకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి వారిద్దరి మధ్య రాజీ కుర్చి ఐదేళ్ల సర్పంచ్ పదవీ కాలాన్ని ఇద్దరూ చెరి సగం పంచుకోవాలని తీర్మానించారు. ఆ క్రమంలో తొలుత డాక్టర్‌హబీబ్ బాషా సర్పంచుగా 2021 ఏప్రిల్ మాసంలో బాధ్యతలు చేపట్టగా ఒప్పందంలో భాగంగా ఆయన గత ఏడాది అక్టోబరులో సెలవులో వెళ్లిపోయారు. ఆ తరువాత ఉపసర్పంచు అయిన షామియాన షఫీ సతీమణి జీనత్ షఫీ ఇన్‌ఛార్జ్ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ హబీబ్ బాషా అందజేసిన లీవ్ లెటర్ గడువు ఈ నెల 6వ తేదీతో ముగిసింది. ప్రతి మూడు నెలలకోసారి ఆయన తన సెలవును పొడిగించాల్సి ఉంది. దీంతో ఇన్‌ఛార్జ్ సర్పంచ్ జీనత్ షఫీ కుటుంబసభ్యులు స్థానికంగా ఓ వైద్యురాలిని సంప్రదించి డాక్టర్ హబీబ్ బాషా తీవ్రమైన మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారని సర్టిఫికేట్ సంపాదించి దానిని ఉన్నతాధికారులకు అందించి సెలవును పొడిగించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న హబీబ్ ఇన్‌ఛార్జ్ ఈవో గఫూర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతరత్రా కారణాలు చూపకుండా తన మానసిక స్థితి సరిగ్గా లేదంటూ డాక్టర్ సర్టిఫికెట్ ఎలా ఆమోదిస్తారంటూ బుధవారం ఆయనపై ఫోనులో ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా తీవ్రంగా దుర్భాషలాడారు.

డీపీవోకు హబీబ్ ఫిర్యాదు

ఈవోను దుర్భాషలాడిన హబీబ్ అంతటితో ఆగకుండా గఫూర్‌పై గురువారం డీపీవో ధనలక్ష్మికి ఫిర్యాదు చేశారు. తన ప్రమేయం లేకుండా తన మానసికి స్థితి సరిగ్గా లేదంటూ తప్పుడు సర్టిఫికెట్ సంపాదించి సెలవు పొడిగించుకున్నారని తెలిపారు. అంతే కాకుండా తాను పదవిలో ఉన్న రెండున్నరేళ్ల కాలంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడని నిరూపించేందుకు ఈవో గఫూర్, ఇన్‌ఛార్జ్ సర్పంచ్ కుటుంబసభ్యులు కుట్రపన్నుతున్నారని, తన హయాంలోని రికార్డులు ట్యాంపర్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి వ్యవహారంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అంతటితో ఆగకుండా తన పదవీ కాలంలో జరిగిన వ్యవహారాలపై విచారణ జరపాల్సిందిగా తానే స్వయంగా కోరినట్లు సోషల్ మీడియలో పోస్టు చేసుకున్నారు. దీంతో పంచాయతీలో అంతర్గతంగా జరుగుతున్న వ్యవహారం బహిర్గతమైంది.

28న తంబళ్లపల్లె మార్గంలో లక్కీడిప్

మదనపల్లె అర్బన్, జూన్ 20: తంబళ్లపల్లె మార్గంలో ప్రయాణికుల ప్రోత్సాహం కోసం ఈ నెల 28న లక్కీడిప్ నిర్వహిస్తున్నట్లు వన్‌డిపో డీఎం తెలిపారు. ఆ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు టికెటుపై పేరు. ఊరుపేరు. మొబైల్‌నెంబరు రాసి బస్సులోని గిఫ్ట్‌బాక్సులో వేయాలని కోరారు.

ఇంటర్న్‌షిప్‌కు 20 మంది మిట్స్ విద్యార్థులు ఎంపిక

కురబలకోట, జూన్ 20:మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజు తెలిపారు. కళాశాల్లో ద్వితియ, తృతీయ సంవత్సరం సీఎస్ఈ విభాగానికి చెందిన విద్యార్థులు కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లోని కేన్స్ టెక్నాలజీ ఇండియా లిమిటెడ్‌లో కేబుల్ మ్యాన్ ఫ్యాక్టరింగ్ మరియు ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు సంబంధించి నాణ్యతపై 45 రోజులపాటు పరిశోధనలు చేస్తారని తెలిపారు. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ విజయ్ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తినాదెళ్ల, ప్రిన్సిపాల్ యువరాజ్, పవన్ అభినందించారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం

మదనపల్లె అర్బన్, జూన్ 20: స్థానిక నీరుగట్టువారిపల్లె సమీపంలోని టిప్పుసుల్తాన్ మైదానంలో 20వ తేదీ నుంచి 18 రోజులపాటు మహాభారతయజ్ఞం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. గురువారం గణపతి హోమం, ప్రత్యేకయపూజలతో మహాభారతయజ్ఞం ప్రారంభమైంది, పగలు హరిదాసుచే హరికథ, ప్రతి రోజు రాత్రి నాటకం నిర్వహించనున్నారు.

బీసీజీ టీకాతో క్షయ వ్యాధి నివారణ

తంబళ్లపల్లె, జూన్ 20: వయోజన బీసీజీ టీకాతో క్షయ వ్యాధిని నిరోధించవచ్చని కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి మునికుమార్ అన్నారు. గురువారం మండలంలోని 12 ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో బీసీజీ టీకా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి బారిన పడి కోలుకున్నవారు, వారి కుటుంబ సభ్యులు తప్పనిసరిగా టీకా వేసుకోవాలన్నారు. గురువారం మండల వ్యాప్తంగా 426 మందికి బీసీజీ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ క్రిష్ణానాయక్, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడే బ్రహ్మాండమైన విడుదల



నంద్యాల	-	ఎఆర్ మినీ
కడప	-	ఎస్ ఆర్ సాయిబాబా
అనంతపురం	-	గంగ
రాజంపేట	-	ఎస్ఎస్ఆర్ థియేటర్
రాయచోటి	-	గౌతమ్

CONTACT: 95507 40061

నేడే బ్రహ్మాండమైన విడుదల



తిరుపతి	-	శ్రీనివాస తేజ
మదనపల్లి	-	మినీ సిద్ధార్థ
చిత్తూరు	-	గురునాథ్
చిత్తూరు	-	ఆనంద్ స్క్రీన్-6
నంద్యాల	-	సంగీత
అనంతపురం	-	తేజశ్విని
కడప	-	ప్రతాప్
ప్రొద్దుటూరు	-	కళ్యాణ్ స్క్రీన్-3
రాజంపేట	-	సమద్
ఎమ్మిగనూరు	-	మినీ శ్రీనివాస

SUCHIN CINEMAS 95507 40061



